RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 401 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | గురువారం 24 ఏప్రిల్ 2025 | వెల : 4/-



## పహల్గాం దాడికి దీటుగా బదులిస్తాం

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- 'పహల్గాం'లో జరిగిన ఉగ్రవాదుల పిరికిపంద చర్యతో అమాయకులు ప్రాణాలను కోల్పోయారు
- ఈ దుర్ఘటన నన్ను కలచివేసింది
- మృతుల కుటుంబాలకు నా సంతాపం తెలియజేస్తున్నాను.

# ఆ కేసు కొట్టేయండి



- హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డి పిటిషన్
- నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టేయాలని పిటిషన్
- బీజేపీకి పరువు నష్టం కలిగేలా రేవంత్‌రెడ్డి మాట్లాడారని ఫిర్యాదు
- భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా

**హైదరాబాద్:**

ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. గత సంవత్సరం ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. బీజేపీకి పరువు నష్టం కలిగేలా రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల టైంలో చెప్పారని కాసం కాసం వెంకటేశ్వర్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రసంగం వీడియో , ఆడియో క్లిప్పింగ్‌లను సైతం కాసం కోర్టుకు సమర్పించారు. దీంతో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని సీఎం హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేపట్టవద్దని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే, కోర్టు హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.



## ఉగ్రదాడిపై భారత్‌కు అమెరికా పూర్తి మద్దతు

- పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రధాని మోదీకి అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ ఫోన్ కాల్
- దాడిని తీవ్రంగా ఖండించి, మృతులకు సంతాపం తెలిపిన వాన్స్
- ఉగ్రవాదంపై ఉమ్మడి పోరులో భారత్‌కు అన్ని విధాల సహాయం చేస్తామని అమెరికా హామీ
- అంతకుముందే మోదీతో ఫోన్లో మాట్లాడిన అధ్యక్షుడు ట్రంప్
- దాడి సూత్రధారులను కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేసిన ప్రధాని మోదీ

## మజ్లిస్ వర్సెస్ బీజేపీ

**ముగిసిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్**

**77.56 శాతం నమోదైన ఓటింగ్**

**ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్**

**ఈ నెల 25న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి**



**హైదరాబాద్**

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. మొత్తం 112 ఓట్లకు గాను 88 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో 77.56 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. బీఆర్‌ఎస్ మినహా బీజేపీ, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల ప్రజాప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ నెల 25న ఓట్ల లెక్కింపు జరగనుండగా, అదే రోజు ఫలితాలు - మిగతా3లో



## జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు ఉగ్రవాదులు హతం
- భారత సరిహద్దుల నుంచి చొరబాటుకు యత్నిస్తున్న ఇద్దరు ఉగ్రవాదులు
- ఉగ్రవాదుల నుంచి భారీ స్థాయిలో మందుగుండు సామగ్రి, ఇతర ఆయుధాలు స్వాధీనం

## కశ్మీర్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకురండి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కేటీఆర్ విజ్ఞప్తి**

**రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకుని, వారిని సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి**

**తెలంగాణ పర్యాటకులకు అవసరమైన సంరక్షణ, సహాయం అందించాలి**

**హైదరాబాద్**

జమ్ముకశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన నరమేధం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ క్రమంలో జమ్ముకశ్మీర్ పర్యటనకు వెళ్లి తెలంగాణకు చెందిన 80 మంది పర్యాటకులు నిన్నటి నుంచి శ్రీనగర్‌లో చిక్కుకుపోయారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకుని, వారిని సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చేందుకు - మిగతా3లో






## 6 గంటల్లో 3,300 మంది

- కశ్మీర్‌ను వీడుతున్న పర్యటకులు
- "ఉగ్రదాడి నేపథ్యంలో శ్రీనగర్ నుంచి పర్యటకుల సురక్షిత ప్రయాణం కోసం అన్ని ఏర్పాట్లు చేశాం
- విమానాశ్రయంలో రద్దీ దృష్ట్యా ప్రత్యేక సదుపాయాలు కల్పించాం
- ప్రయాణికుల సౌకర్యం కోసం అదనపు విమానాలు అందుబాటులో ఉంచాం
- టికెట్ ధరలు పెంచొద్దని విమానయాన సంస్థలను ఆదేశించాం.
- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

# టీపీసీసీలో ప్రక్షాళన!

- పార్టీ ప్రక్షాళనకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దిశానిర్దేశం
- పరిశీలకులకు మూడు దశల్లో టాస్క్ నిర్దేశించాం
- 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు
- జిల్లా సమావేశాలకు బ్లాక్, మండల అధ్యక్షులను ఆహ్వానించాలని సూచన
- టాస్క్ -2లో అసెంబ్లీ, బ్లాక్ లెవెల్ మీటింగ్స్, టాస్క్-3లో మండల మీటింగ్స్ ఏర్పాటు



**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో టీపీసీసీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని కార్యవర్గాల కూర్పు ఉంటుందని చెప్పారు. గాంధీభవన్‌లో బుధవారం తెలంగాణ రాష్ట్ర పరిశీలకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. పార్టీ ప్రక్షాళనకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దిశానిర్దేశం చేశారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పరిశీలకులకు మూడు దశల్లో టాస్క్ నిర్దేశించామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఏప్రిల్ 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. జిల్లా సమావేశాలకు బ్లాక్, మండల అధ్యక్షులను ఆహ్వానించాలని సూచించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోటీ చేసిన అభ్యర్థులు, ఏఐసీసీ, పీసీసీ ఆఫీస్ బేరర్లు, జిల్లా స్థాయి సీనియర్ నాయకులను ఆహ్వానించాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. టాస్క్ -2లో అసెంబ్లీ, బ్లాక్ లెవెల్ మీటింగ్స్, టాస్క్-3లో మండల మీటింగ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాలు - మిగతా3లో




## ఉగ్రవాదానికి భారత్ తలొగ్గదు

- ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోం
- బాధితుల ఆవేదనను ప్రతీ భారతీయుడు అనుభవిస్తున్నాడు అని ట్వీట్
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- కాల్పులు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన అమిత్ షా

# పహల్గాం దాడికి దీటుగా బదులిస్తాం

**ఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడుల వెనుక ఎవరు ఉన్నా వదిలిపెట్టబోమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరికలు జారీ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రదాడిపై రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల పిరికిపంద చర్యతో అమాయకులు ప్రాణాలను కోల్పోయారు. ఈ దుర్ఘటన నన్ను కలచివేసింది. మృతుల కుటుంబాలకు నా సంతాపం తెలియజేస్తున్నాను. ఉగ్రవాదంపై దేశం సంకల్పాన్ని పునరావృతం చేయాలనుకుంటున్నాను. భారత్‌ను ఎవరూ భయపెట్టలేరు. ప్రభుత్వం అవసరమైన ప్రతి చర్య తీసుకుంటుందని దేశ ప్రజలకు నేను హామీ ఇస్తున్నాను. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని మాత్రమే కాదు, తెరవెనుక ఉన్న ఎంతటివారినైనా ఉపేక్షించబోం. ప్రతీకారం తీర్చుకుంటాం' అని హెచ్చరించారు.



**ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా.. వారి వెనుక ఎవరున్నా**

ఉగ్రవాద దాడి తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా పరిస్థితిని సమీక్షించేందుకు త్రివిధ దళాదిపతులతో రాజ్‌నాథ్ సింగ్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎకె సింగ్ పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాతే పహల్గాంలో దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా.. వారి వెనుక ఎవరున్నా విడిచి పెట్టమంటూ ఘాటుగా స్పందించారు.

**సాయంత్రం కేంద్ర కేబినెట్ సమావేశం**

రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలతో కశ్మీర్, పీవోకేలో ఉగ్రవాదుల ఏరివేతకు కేంద్రం ఆపరేషన్? చేపట్టేందుకు సిద్ధమైందంటూ పలు జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. అందుకు ఊతం ఇచ్చేలా ప్రధాని మోదీ,రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు వరుస సమావేశాలు నిర్వహించారు. హెూం మంత్రి అమిత్ షా జమ్మూకశ్మీర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.ఇప్పటికే కశ్మీర్ పరిస్థితులను జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ప్రధాని మోదీకి వివరించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో త్రివిధ దళాధిపతులతో సమావేశమయ్యారు.కేంద్రం ఆదేశాల అమలుకు త్రివిధ దళాధిపతులు సిద్ధమనే సంకేతాలిచ్చారు.పహల్గాం ఉగ్రదాడి ప్రధానాంశంగా సాయంత్రం కేంద్ర కేబినెట్ సమావేశం జరగనుంది. సమావేశం అనంతరం కీలక నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

# ఉగ్రదాడిపై భారత్‌కు అమెరికా పూర్తి మద్దతు

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని అమెరికా తీవ్రంగా ఖండించింది. భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ బుధవారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ హేయమైన దాడి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన వాన్స్, ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడానికి అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రస్తుతం ఆగ్రాలో ఉన్న వాన్స్.. ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడుతూ, పహల్గామ్ దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో భారత ప్రజలకు అమెరికా అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరులో అవసరమైన పూర్తి సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్‌ల మద్దతు, సంఘీభావ సందేశాలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపినట్లు విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతకుముందు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ప్రధాని మోదీకి ఫోన్ చేసి పహల్గామ్ దాడిపై సంతాపం తెలిపారు. అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఈ దాడిని తీవ్రంగా ఖండించిన ట్రంప్, సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టడంలో భారత్‌కు పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా కలిసి నిలుస్తాయని ఉద్ఘాటించారు. ఈ పిరికిపంద చర్యకు పాల్పడిన వారిని, దాని వెనుక ఉన్న శక్తులను కఠినంగా శిక్షించడానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడికి స్పష్టం చేసినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

**జేడీ వాన్స్ టూర్ సందర్భంగా కశ్మీర్‌లో ఉగ్రదాడి.. గుర్తుచేసిన బిల్ క్లింటన్ సందర్శన**



అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌లో పర్యటిస్తున్న సందర్భంగా జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడి జరిగింది. అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్ సమీపంలోని బైసరన్ వ్యాలీలో మంగళవారం ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరిపారు. 26 మంది మరణించగా 20 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఉగ్రదాడి దేశవ్యాప్తంగా కలకలం రేపింది. కాగా, అమెరికా అగ్ర నేత భారత్‌ను సందర్శించిన సందర్భంగా ఉగ్రవాదులు మారణహెూమానికి పాల్పడటం ఇది రెండోసారి. 2000 మార్చిలో నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మార్చి 20న అనంత్‌నాగ్ జిల్లాలోని చిట్టిసింగ్‌పోరా అనే మారుమూల గ్రామాన్ని ఉగ్రవాదులు చుట్టుముట్టారు. రాత్రి 7.20 గంటల సమయంలో ఇండియన్ ఆర్మీ యూనిఫారం ధరించిన టెర్రరిస్టులు సిక్కులు ప్రధానంగా నివసించే ఈ గ్రామంలోకి ప్రవేశించారు. ఆపిల్ తోటలు, పొలాల్లో నుంచి నిశ్శబ్దంగా చేరుకున్నారు. మరోవైపు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు కొవ్వొత్తులు, లాంతర్లు వెలిగించారు. నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత తొలి పర్యటన గురించిన వార్తలను రేడియోలో వింటున్నారు. కొందరు స్థానిక గురుద్వారాల్లో సాయంత్రం ప్రార్థనల తర్వాత తమ ఇళ్లకు చేరుకున్నారు. కాగా, సిక్కు ప్రజలు ఎవరి పనుల్లో వారు బిజీగా ఉండగా ఉగ్రవాదులు చెలరేగిపోయారు. గుంపులుగా విడిపోయి ప్రార్థనా స్థలాలు, షాపులు, ఇళ్ల వద్ద ఉన్న సిక్కు పురుషులను చుట్టుముట్టారు. 37 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని ఒకచోట చేర్చి అతి సమీపం నుంచి కాల్చి చంపారు. 35 మంది సిక్కులు అక్కడికక్కడే మరణించగా ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. జమ్ముకశ్మీర్‌లో ఏళ్లుగా కొనసాగుతున్న ఉగ్ర దాడుల్లో ప్రత్యేకంగా సిక్కు వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం ఇదే తొలిసారి.

# 6 గంటల్లో 3,300 మంది..

**ఇంటర్నెట్ డెస్క్:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి భయభ్రాంతులకు గురిచేసింది. ఈ ఘటనతో వణికిపోయిన పర్యటకులు వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని వీడుతున్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో ప్రజలు సొంత ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యారు. కేవలం 6 గంటల వ్యవధిలోనే 3,300 మంది శ్రీనగర్‌ను వీడినట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. "ఉగ్రదాడి నేపథ్యంలో శ్రీనగర్ నుంచి పర్యటకుల సురక్షిత ప్రయాణం కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. విమానాశ్రయంలో రద్దీ దృష్ట్యా ప్రత్యేక సదుపాయాలు కల్పించాం. ఆహారం, నీరు అందించాం. బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీనగర్ ఎయిర్‌పోర్టు నుంచి 20 విమానాలు వెళ్లాయి. 3,337 మంది పర్యటకులు ఈ ప్రాంతాన్ని వీడారు. ప్రయాణికుల సౌకర్యం కోసం అదనపు విమానాలు అందుబాటులో ఉంచాం. టికెట్ ధరలు పెంచొద్దని విమానయాన సంస్థలను ఆదేశించాం. ఇప్పటికే అన్ని ఎయిర్‌లైన్లు టికెట్ క్యాన్సిలేషన్, రీషెడ్యూల్ ఛార్జీలను రద్దు చేశాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో మనమంతా పర్యటకులకు అండగా నిలవాలి" అని కేంద్రమంత్రి తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

**ఇంటెలిజెన్స్ 'హాట్‌సమ్మర్' హెచ్చరికలను పెడచెవిన పెట్టారా..!**



పర్యటకులు వీడుతుంటే బాధగా ఉంది: ఒమర్ అబ్దుల్లా

మరోవైపు తాజా పరిణామాలపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి స్పందించారు. "కశ్మీర్ లోయ నుంచి అతిథులు వీడుతుంటే నా హృదయం ద్రవిస్తోంది. అయితే వారు ఎందుకు వెళ్లిపోవాలనుకుంటున్నారనేది నేను అర్థం చేసుకోగలను. పర్యటకుల తిరుగు ప్రయాణం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. కేంద్రం కల్పించిన అదనపు విమానాలతో పాటు రోడ్డు మార్గంలోనూ ప్రయాణ సౌకర్యాలు కల్పించాం" అని సీఎం వెల్లడించారు. కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3గంటల సమయం సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యాటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. మృతుల కుటుంబాలకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వం రూ.10లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించింది.

# జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

శ్రీనగర్: కశ్మీర్ లోయలో ఉగ్రదాడి ఘటన వేళ బారాముల్లాలో తాజాగా ఎన్‌కౌంటర్ జరిగింది. భారత సైన్యం జరిపిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్టు సమాచారం. ఈ క్రమంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం ప్రకటించింది. వివరాల ప్రకారం.. బారాముల్లలో బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. భారత సరిహద్దుల నుంచి చొరబాటుకు యత్నిస్తున్న ఇద్దరు ఉగ్రవాదులను సైన్యం హతమార్చింది. ఈ సందర్భంగా ఉగ్రవాదుల నుంచి భారీ స్థాయిలో మందుగుండు సామగ్రి, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం ప్రకటించింది. దీంతో, యూరి సెక్టార్‌లో కూంబింగ్ కొనసాగుతోంది.



## కర్ణాటక సీఎంను, డిప్యూటీ సీఎంను చంపేస్తాం.. సిద్ధూ, డీకేలకు బెదిరింపు మెయిల్స్..!



కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ను హతమారుస్తామని బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. సీఎం, డిప్యూటీ సీఎంలను దారుణంగా హత్య చేస్తామని ఓ దుండగుడు ఈ మెయిల్‌లో బెదిరింపు సందేశం పంపాడు. కర్ణాటక విధానసౌధ పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. రాంపురకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తికి తాను కోటి రూపాయలు అప్పుగా ఇచ్చానని, దానిని ఇంకా తిరిగి చెల్లించనందున అతడిని కూడా హత్య చేస్తానని మెయిల్‌లో ఆగంతకుడు పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సింధార్ రాజపుత్ అనే వ్యక్తి పేరిట మెయిల్ వచ్చినట్లు గుర్తించామని, తదుపరి విచారణ కొనసాగుతోందని అన్నారు. త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బెదిరింపు మెయిల్ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నివాసాల దగ్గర భద్రతను కట్టుదిట్టం చేశామని చెప్పారు.

## ఉగ్రవాదానికి భారత్ తలొగ్గదు



**న్యూఢిల్లీ:** ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలొగ్గదని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. 'భారమైన హృదయంతో పెహల్‌గామ్ ఉగ్రదాడిలో మరణించిన వారికి అంతిమ నివాళులర్పిస్తున్నాను. భారత్ ఉగ్రవాదానికి తలొగ్గదు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోం' అని షా తీవ్రంగా హెచ్చరించారు. ఈ మేరకు మృతులకు నివాళులర్పిస్తున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇవాళ ఉదయం శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా.. పెహల్‌గామ్ ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారిని పరామర్శించి ఓదార్చారు. వారి వేదనను విన్నారు. ఈ సందర్భంగా తమ ఆప్తులను కోల్పోయిన వారు కేంద్ర మంత్రి ముందు కన్నీటి పర్యంతమయ్యారు. విహారయాత్ర కోసం వస్తే మావాళ్లను పొట్టన పెట్టుకున్నారంటూ రోదించారు. ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులపై అడవిలో నుంచి హఠాత్తుగా ప్రత్యక్షమైన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. మహిళలు, పిల్లలను వదిలిపెట్టి కంటికి కనిపించిన పురుషులను కాల్చుకుంటూ పోయారు. ఈ దాడిలో సుమారు 28 మంది టూరిస్ట్‌లు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు, నలుగురు ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## ఉగ్ర రక్కసిపై గళమెత్తిన కశ్మీర్.. ఆరేళ్లలో తొలిసారి బంద్!

**ఇంటర్నెట్ డెస్క్:** ఉగ్ర రక్కసికి జమ్మూ కశ్మీర్ మరోసారి ఉలిక్కిపడింది. పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడితో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. దీంతో శ్రీనగర్ సహా స్థానికంగా అనేక ప్రాంతాల్లో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. తాజా ఘటనతో కశ్మీరీలు సిగ్గుతో తల దించుకుంటున్నారని అన్నారు. అటు నేషనల్ కాన్ఫరెన్స్ కూడా లాల్‌చౌక్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టింది.

**ఆరేళ్లలో తొలిసారి..**

రాజకీయ పార్టీలు సహా అన్ని వర్గాల ప్రజలు ఉగ్ర చర్యలను ఖండిస్తూ నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలో శ్రీనగర్ సహా అనేక చోట్ల బంద్ పాటించారు. కశ్మీర్ ఆర్థిక వ్యవస్థ మూలాలను దెబ్బతీశారని ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఇటీవలి కాలంలో దుకాణాలు మూతపడటం ఇదే తొలిసారి. ఆగస్టు 2019కు ముందు ఇక్కడ ఇటువంటివి సర్వసాధారణం కాగా.. ఆర్టికల్ 370 రద్దు తర్వాత, గత ఆరేళ్లలో కశ్మీర్‌లో బంద్ పాటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

**పహల్గాం ఉగ్ర దాడి.. పాక్ ఆర్మీ చీఫ్ ఉసిగొల్పారా..?**

"ఇటువంటివి మళ్లీ పునరావృతం కాకూడదు. కశ్మీర్ పేరుతో, ఏదైనా వర్గం పేరుతో ఇలాంటివి మరోసారి జరగకూడదు. అమాయకుల ప్రాణాలు తీయడం అంటే మొత్తం మానవాళినే చంపడంతో సమానం" అని హాజీ బాషిర్ అహ్మద్ అనే శ్రీనగర్ వాసి మీడియాతో పేర్కొన్నాడు. వీలైనంత త్వరగా ఉగ్రవాద మూలాలను పెకిలివేసేలా చర్యలు చేపట్టాలని స్థానిక పండ్ల వ్యాపారి జీఎం బాండే పేర్కొన్నాడు. కశ్మీరీ ప్రజలు ఉగ్రవాదానికి ఎప్పుడూ వ్యతిరేకమేనన్నాడు. అయితే, కశ్మీరీ సమాజాన్ని కించపరచడం, స్థానిక ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు ప్రభుత్వం ఏం చర్య తీసుకున్నా తాము మద్దుతు ఇస్తామన్నారు.

**ప్రపంచానికి సందేశం చాటేందుకే..**

ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా జిల్లా హంద్వారాలో నిరసనలు చేపట్టారు. ఉగ్ర చర్యకు వ్యతిరేకంగా దక్షిణ కశ్మీర్‌లోనూ నిరసనలు వెల్లువెత్తాయి. 2016లో హిజ్‌బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వానీ హతమైన తర్వాత ఇదే విధంగా స్థానికులు వీధుల్లోకి వచ్చారు. కశ్మీరీలు ఉగ్రవాదంతో లేరనే సందేశాన్ని ప్రపంచానికి చాటేందుకే ఈ నిరసనలు చేస్తున్నామని, పర్యటకులపై దాడిని ఖండిస్తున్నామని స్థానిక సామాజిక కార్యకర్త తౌసీఫ్ అహ్మద్ పేర్కొన్నారు. దాడికి పాల్పడినవారు జమ్మూ కశ్మీర్ ప్రజల మేలు కోరే వారు కాదని నేషనల్ కాన్ఫరెన్స్ నేత, శ్రీనగర్ ఎంపీ అగా సయ్యద్ రుహుల్లా మెహ్‌దీ పేర్కొన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకొని చట్టం ముందు నిలబెడుతామన్నారు. రాంబన్ జిల్లాలోనూ నిరసనలు జరిగాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలతో విలవిలలాడుతున్నప్పటికీ.. ఉగ్రదాడికి నిరసనగా బంద్ పాటించి శాంతియుతంగా నిరసనలు చేపట్టారు. ఈ పట్టణ చరిత్రలో తొలిసారిగా హిందూ, ముస్లిం వర్గాలు కలిసి ఉగ్రచర్యకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం గమనార్హం.

# టీపీసీసీలో ప్రక్షాళన!


-మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో పెద్ద ఎత్తున విజయవంతం అవుతున్నాయని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కో ఆర్డినేటర్లు ఇచ్చిన బాధ్యతలను మంచిగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఏఐసీసీ అగ్రనేతలు తెలంగాణలో జరుగుతున్న జై బాపు, జై భీమ్ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారని చెప్పారు. పార్టీ పటిష్టతకు సంస్థాగత నిర్మాణం చాలా కీలకమని మహేష్ కుమార్ గౌడ్ ఉద్ఘాటించారు.

**కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలి: మీనాక్షి నటరాజన్**

కాంగ్రెస్ పార్టీకి చాలా చరిత్ర ఉందని.. బ్రిటిష్ వాళ్లతో కూడా పోరాటం చేసిందని ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తెలిపారు. విస్తృత భావజాలం ఉన్న పార్టీ అని.. జాతీయ స్థాయి ఆలోచనలతో కాంగ్రెస్ పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ గాంధీ సిద్ధాంతాలతో నడుస్తుందని తెలిపారు. పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలని సూచించారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చాలా చిత్తశుద్ధితో సీరియస్‌గా పని చేయాలని మీనాక్షి నటరాజన్ ఆదేశించారు.

ప్రస్తుతం గుజరాత్ మోడల్‌గా పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని మీనాక్షి నటరాజన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు విస్తారంగా జనంలోకి పోవాలని సూచించారు. సిద్ధాంత పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో



కులగణన 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మకమని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రేవంత్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తుచేశారు. దేశంలో మోదీ ప్రభుత్వం, గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రేవంత్ ప్రభుత్వం చేపట్టిందని ఉద్ఘాటించారు. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీనాక్షి నటరాజన్ సూచించారు.

## జనరల్ మజ్దూర్‌లు ఇక జనరల్ అసిస్టెంట్లు..
## కీలక ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం

**సింగరేణి భవన్ :** సింగరేణి సంస్థలోని కేటగిరీ-1లో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్లను ఇకపై జనరల్ అసిస్టెంట్‌గా గుర్తించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి వేజ్ బోర్డు ఒప్పందం మేరకే ఈ పేరు మార్చాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ సర్క్యులర్ జారీ చేశారు. ఈ ఉత్తర్వులపై సింగరేణిలోని 14 వేల మంది జనరల్ మజ్దూర్లతో పాటు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు సింగరేణి సంస్థలోని కేటగిరీ-1లో పనిచేసే వారిని జనరల్ మజ్దూర్ అని పిలవడం అలవాటుగా వస్తుంది. మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు, కూలీ అని అర్థం. సింగరేణి సంస్థలోనే కాకుండా కోల్ ఇండియాలో కూడా కింది స్థాయి ఉద్యోగులను ఇదే పేరుతో పిలుస్తూ వస్తున్నారు. బొగ్గు తవ్వకం తొలి రోజుల్లో గుత్తేదారులే యజమానులుగా ఉంటుండేవారు. బొగ్గు తవ్వడం కోసం పల్లె ప్రాంతం నుంచి కూలీ(మజ్దూర్)లను తీసుకొని వస్తుండేవారు. కాలక్రమంలో బొగ్గు గనులు జాతీయాకరణ జరిగిన తర్వాత ఈ మజ్దూర్‌లను అన్ని రకాల శారీరక శ్రమకు సంబంధించిన పనులకు వినియోగిస్తుండేవారు. అందుకే వీరిని జనరల్ మజ్దూర్‌లుగా గుర్తించారు. గతంలో కేవలం నిరక్షరాస్యులు మాత్రమే జనరల్ జనరల్ మజ్దూర్లుగా పనిచేస్తుండేవారు. కానీ నేడు కారుణ్య నియామకాల్లో భాగంగా ఉన్నత చదువులు చదివిన వారు కూడా తొలుత బదిలీ వర్కర్లుగా ఎంపికై ఏడాది



తర్వాత జనరల్ మజ్దూర్లుగా గుర్తించబడుతున్నారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో జనరల్ మజ్దూర్లు కూడా కీలకంగా ఉంటున్నందువల్ల, వీరి వృత్తికి కూడా సముచిత గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశంతో జనరల్ మజ్దూర్ అనే పేరును తొలగించి జనరల్ అసిస్టెంట్‌గా మార్పు చేశారు. ఈ మార్పును వెంటనే అమలు చేసిన సీఎండీ బలరామ్‌కు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇది వండిపెట్టినా వడ్డించుకో చేతగాని ప్రభుత్వం..
## రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ ధ్వజం

**అలంపూర్ :** కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి భక్త యాత్రికుల కోసం అవసరమైన వసతి గృహాలు ఏర్పాటు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం వాటిని ఉపయోగంలోకి తేవడానికి కూడా చేతకావడం లేదని బీజేపీ ధ్వజమెత్తింది. ప్రజాపాలనపై ఏమాత్రం అవగాహన లేని ప్రభుత్వం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని జోగులాంబ గద్వాల జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం బీజేపీ నాయకులు రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ క్షేత్రంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా సుమారు రూ.37 కోట్ల నిధులతో నిర్మించిన యాత్రికుల వసతిగృహ భవన సముదాయాన్ని సందర్శించి మాట్లాడారు. భవనం నిర్మాణం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగంలోకి తేలేకపోతుందని విమర్శించారు. అన్నం వండి వడ్డించినా కూడా తినలేని దీనస్థితిలో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ కోరిక మేరకు ప్రసాద్ స్కీమ్ భవన సముదాయంలో అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానానికి లక్షల విలువైన గదుల సముదాయాన్ని, భక్తుల సౌకర్యార్థం ఉచిత అన్నశాలను అప్పగించినా వాటిని నేటికి వాడుకోలేకపోతున్నారని ఆరోపించారు. యాత్రికల కోసం కోట్లు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన ప్రసాద్ స్కీమ్ భవనాన్ని ఉపయోగంలోకి తేవాలని



డిమాండ్ చేశారు. అలాగే అలంపూర్ చౌరస్తాలో సుమారు 25 కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన 100 పడకల దవఖానను ప్రభుత్వం నేటి వరకు వినియోగంలోకి తేలేదన్నారు. ప్రజలకు నిత్యం ఓపి సౌకర్యం కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, సంబంధిత శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రులు స్పందించి దవఖానను వినియోగంలోకి తేవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని గుర్తుచేశారు. అందుబాటులోకి తేకపోతే దవఖాన భవన సముదాయం ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకొని కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజగోపాల్, రాజశేఖర్, శర్మ, ఈశ్వరయ్య, రంగస్వామి, మహేష్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## రేపు కూడా భగభగలే..!
## ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్

**హైదరాబాద్:** తెలంగాణలో నేడు, రేపు భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు రెడ్‌అలర్ట్ ప్రకటించింది. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా టెంపరేచర్స్ నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. రెడ్ అలర్ట్ జారీ చేసిన తొమ్మిది జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వడగాల్పుల ప్రభావం ఉందని.. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్ మహబూబ్‌నగర్ జిల్లాలకు వడ గాల్పుల హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది.



## జానారెడ్డి ఎపిసోడ్.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రియాక్షన్



**హైదరాబాద్:** గాంధీ భవన్‌లో ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌తో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇవాళ భేటీ అయ్యారు. వారం క్రితం జానారెడ్డిపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తనకు మంత్రి పదవి రాకుండా మాజీ మంత్రి జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నాడంటూ తీవ్ర వ్యాఖ్యలే చేశారాయన. అయితే, జానారెడ్డి ఎపిసోడ్‌పై రాజగోపాల్‌రెడ్డి.. బుధవారం స్పందించారు. “జానారెడ్డి అంటే నాకు గౌరవం. ఆయన మా పార్టీ సీనియర్ నేత. జానారెడ్డి రాసిన లెటర్‌పై ఒక సభలో మాట్లాడాను. మంత్రి పదవి పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయం” అంటూ రాజగోపాల్‌రెడ్డి చెప్పుకొచ్చారు. కాగా, మంత్రి వర్గ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి గట్టి హెచ్చరికలే చేశారు. పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది. ..మంత్రి పదవి కోరే వాళ్లు మాట్లాడితే వారికే నష్టం. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు. అలా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు” అంటూ రేవంత్ తేల్చి చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదన్నారు.

## మజ్లిస్ వర్సెస్ బీజేపీ

-మొదటిపేజీ తరువాయి

వెల్లడించనున్నారు. బీజేపీ గోషామహల్ శాసనసభ్యుడు రాజాసింగ్, మజ్లిస్ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో ఉన్నారు. 81 మంది కార్పొరేటర్లకు గాను 66 మంది, 31 మంది ఎక్స్-అఫిషియో సభ్యులలో 21 మంది ఓటు వేశారు. మజ్లిస్ పార్టీ తరఫున మీర్జా రియాజ్ ఉల్ హసన్, బీజేపీ తరఫున గౌతమ్ రావు పోటీ చేస్తున్నారు.

## కశ్మీర్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకురండి.

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తెలంగాణ పర్యాటకులకు అవసరమైన సంరక్షణ, సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ కోరారు. వారిని సురక్షితంగా ఇండ్లకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కాగా, జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడిపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత్‌పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. దాడికి భారత్ గట్టి బదులిస్తుందని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఆ ఉగ్రదాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని, ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. దాడికి పాల్పడిన వాళ్లను, కుట్ర పన్నిన వాళ్లను బయటకు లాగి తగిన బుద్ధి చెబుతామన్నారు.

## అఘోరీకి షాక్ ఇచ్చిన సంగారెడ్డి జైలు అధికారులు



**సంగారెడ్డి:** చీటింగ్ కేసులో అరెస్టయిన అఘోరీకి సంగారెడ్డి జైలు అధికారులు షాక్ ఇచ్చారు. ఆడ, మగ తేలకుండా ఏ బ్యారక్‌లోనూ ఉంచలేమంటూ అధికారులు తేల్చి చెప్పారు. అఘోరీని తిరిగి పంపించిన సంగారెడ్డి జైలు అధికారులు.. లింగ నిర్ధారణ జరిగితే గాని ఇక్కడ ఉంచుకోలేమని స్పష్టం చేశారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు డాక్టర్ల వైద్య పరీక్షల అనంతరం లింగ నిర్ధారణ జరిగే అవకాశం ఉంది. పరీక్షల తర్వాత చంచల్ గూడ జైలుకు తరలించే అవకాశం ఉంది. కాగా, తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన అఘోరీని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఓ మహిళను మోసం చేసిన కేసులో అఘోరీని చేవెళ్ల కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్? విధించారు. మరో వైపు, సంగారెడ్డి జైలుకు తరలిస్తున్న సమయంలో అఘోరీ అరుపులతో హడావుడి చేశాడు. తన భార్య వర్షిణిని తనతోనే ఉంచాలంటూ పట్టుబట్టాడు. పూజల పేరుతో తొమ్మిదిన్నర లక్షలు తీసుకుని మోసం చేశాడనే ఫిర్యాదుతో మోకిలా పోలీసులు.. అఘోరీని అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్- మధ్య ప్రదేశ్ సరిహద్దుల్లో అఘోరీని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. నగరానికి తీసుకువచ్చారు. మోకిలా పోలీసులు. అఘోరీతో పాటు వర్షిణిని కూడా నగరానికి తరలించారు. ఏపీకి చెందిన వర్షిణి.. అఘోరీని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. వీరి పెళ్లికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో కూడా వైరల్ అయిన సంగతి తెలిసిందే. తమను ఎవరైనా అరెస్టు చేయాలని చూస్తే, ఆత్మహత్య చేసుకుంటామని కూడా హెచ్చరించిన ఈ జంట.. ఓ సెల్ఫీ వీడియో కూడా విడుదల చేసింది.

## హైడ్రా కొత్త లోగో చూశారా!

హైదరాబాద్: నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణకు కృషి చేస్తున్న హైడ్రా.. ఇకపై కొత్త లోగోతో తన కార్యకలాపాలను కొనసాగించనుంది. ఇన్నాళ్లు ఈవీడీఎం లోగోతోనే ప్రజల్లోకి వచ్చిన హైడ్రా.. తాజాగా లోగోను మార్చింది. హైదరాబాద్ నగరాన్ని సూచిస్తూ హెచ్ అక్షరంపై నీటి బొట్టు ఉన్న లోగోను రూపొందించింది. జల సంరక్షణ చేపడుతూనే నగరాన్ని విపత్తుల నుంచి రక్షించుకుందామని సూచిస్తూ కొత్త లోగోను తీర్చిదిద్దారు. ఈ లోగోను అధికారికంగా ఆమోదించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. హైడ్రా కార్యాలయంతోపాటు సిబ్బంది యూనిఫాం, వాహనాలపై కొత్త లోగోను ముద్రించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది హైడ్రా అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కొత్త లోగోను అప్‌డేట్ చేసింది.

# సంపాదకీయం

## దండకారణ్యంలో ఆగని హత్యాకాండ

'హింస ద్వారా హింసను ఎప్పటికీ ఆపలేరు. ప్రేమ ద్వారా మాత్రమే హింసను జయించగలం. ఇది శాశ్వతమైన సత్యం' అని బుద్ధుడు అన్నారు. 'ప్రజలే అసలైన హీరోలు, అయితే వారిని అణచివేస్తే తిరుగుబాటు తప్పదు' అని మావో అన్నారు. ఇద్దరి మాటలూ అహింస, ప్రేమ, శాంతి మార్గమే మానవ మనుగడకు అనుసరణీయమని చెబుతున్నాయి. ఆది వాసీల జల్, జంగల్, జమీన్, ఇజ్జత్‌ల కోసం మావోయిస్టులు చేస్తున్న పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అత్యంత దారుణంగా అణచివేస్తోంది. 'ఆపరేషన్ కగార్' పేరుతో అది సాగిస్తున్న సైనిక చర్యతో దండకారణ్యం అగ్నిగుండంలా రగులుతోంది. ఎన్‌కౌంటర్లు, వాయుసేన దాడులతో ఈ ప్రాంతాన్ని మరింత రక్తసిక్తం చేస్తోంది. చత్తీస్‌గఢ్‌తో మొదలై మహారాష్ట్ర, ఒడిశా, జార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు విస్తరించిన ఈ దుర్మార్గపు యుద్ధం అమాయక ఆదివాసీల జీవితాలను బలిగొంటోంది. సొంత ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి ప్రభుత్వం ఏం సాధిస్తుంది? ఇది కేవలం దూకుడు, ఆత్మరక్షణ శక్తుల మధ్య పోరాటం కాదు. ఇది భారత ప్రభుత్వం తన కార్పొరేట్ అనుకూల విధానాలను రుద్దడానికి సాగిస్తున్న ఏకపక్ష యుద్ధం. ఈ హింసాత్మక వాతావరణంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి శాంతి చర్చలే ఏకైక మార్గమని మావోయిస్టులు చేస్తున్న ప్రకటన వారి చిత్తశుద్ధికి నిదర్శనం. సాయుధ పోరాటం కంటే ఇతర శాంతియుత మార్గాల్లోనూ ప్రజల ప్రయోజనాలను సాధించవచ్చని వారు విశ్వసిస్తున్నారు.బుద్ధుడు, మావో ఆలోచనా విధానాలను పాటిస్తున్నారు. ఒకవైపు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటిస్తున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం చర్చలకు ముందుగానే మావోయిస్టులు లొంగిపోవాలనే షరతు విధించడం అత్యంత హాస్యాస్పదమైన విషయం. ప్రభుత్వం ముందుగా చర్చలకు వచ్చి మిగిలిన అంశాలను తేల్చాక కదా లొంగిపోవాలనే డిమాండ్ పెట్టేది. ఈ పోరాటంలో భారత ప్రభుత్వం సామాన్య ప్రజలను నేరుగా లక్ష్యంగా చేసుకుంటోందని మావోయిస్టులు అంటున్నారు. పైకి ఇది మావోయిస్టులకు వ్యతిరేకంగా జరుగుతున్నట్టు చిత్రీకరిస్తున్నా 'ఆపరేషన్ కగార్' కారణంగా చనిపోతున్న వారిలో దాదాపు ముప్పావు వంతు మావోయిస్టులు కాని, నిరాయుధులైన పౌరులేనని వారు వాదిస్తున్నారు. మధ్య భారతదేశంలో సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకే భారత ప్రభుత్వం ఈ యుద్ధాన్ని ప్రారంభించిందని శాంతి చర్చల కమిటీ కూడా తీవ్రంగా ఆరోపిస్తోంది. ఆ ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తున్న ఆదివాసీలను తుడిచిపెట్టి, భారతదేశాన్ని ఆదివాసీ– ముక్త దేశంగా మార్చడమే ప్రభుత్వ అసలు లక్ష్యమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది బలగాలు, వందలాది సైనిక శిబిరాల మధ్య నలిగిపోతున్న ఆదివాసీల జీవితాలు క్షణక్షణం ప్రమాదంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ తమ దండకారణ్య కమిటీ చేసిన ప్రతిపాదనలను చత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి పంపింది. చత్తీస్‌గఢ్‌తో పాటు మహారాష్ట్ర, ఒడిశా, జార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కూడా వెంటనే శాంతి చర్చలకు రావాలని మావోయిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు. 'అణచివేతకు గురైన ప్రజలు, అణగారిన వర్గాలు, అణచివేతకు గురైన జాతీయతలకు వ్యతిరేకంగా 'కగార్' యుద్ధం జరుగుతోంది' అని మావోయిస్టులు కుండబద్దలు కొట్టినట్టు స్పష్టం చేస్తున్నారు. ఇది కేవలం మావోయిస్టులకు, ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న సాధారణ వివాదం కాదు. జనవరి 2024 నుంచి 'ఆపరేషన్ కగార్' పేరుతో కొనసాగుతున్న ఈ మారణహోమంలో ఇప్పటివరకు 400 మందికి పైగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ మానవ విధ్వంసానికి వ్యతిరేకంగా దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగానూ గళాలు వినిపిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితిలో సైతం భారతదేశంలో ఆదివాసీల హక్కుల ఉల్లంఘన తీవ్రంగా చర్చకు వచ్చింది. ఈ దారుణమైన యుద్ధంలో భారత ప్రభుత్వం కేవలం తన సైనిక బలగాలనే కాకుండా ఆదివాసీ యువతను సైతం నియమించి, వారిచేత ఇతర ఆదివాసీలను చంపిస్తోంది. బలవంతంగా లొంగిపోయిన నక్సలైట్లను కూడా ప్రభుత్వ అణచివేత వ్యూహంలో భాగంగా ఉపయోగించే ప్రమాదం ఉంది. ఇది ఆ ప్రాంతంలో అంతర్యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తోంది. గత ఏడాది ప్రధాని నరేంద్ర మోడీ ఆస్ట్రియా పర్యటన సందర్భంగా వియన్నాలో జరిగిన కమ్యూనిటీ కార్యక్రమంలో మాట్లాడుతూ భారత్ బుద్ధుడిని ఇచ్చిందని, యుద్ధాన్ని కాదని ప్రపంచానికి గర్వంగా చెప్పగలమని అన్నారు. అంతేకాదు భారతదేశం ఎప్పుడూ శాంతి గురించి మాట్లాడుతుందన్నారు. మరి ఆయన ప్రభుత్వం దేశంలో చేస్తున్నదేమిటని ప్రపంచ దేశాలు ప్రశ్నిస్తున్నాయి. సొంత ప్రజలను సొంత ప్రజలపైనే ఉసిగొల్పుతున్న ప్రభుత్వ దుర్మార్గపు చర్య ఇది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఏర్పడిన శాంతి చర్చల కమిటీ తక్షణమే కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలకు రావాలని ప్రభుత్వానికి, మావోయిస్టులకు విజ్ఞప్తి చేసింది. ఇప్పుడు మరోసారి హైదరాబాద్‌లో ఏర్పడిన శాంతి చర్చల కమిటీ చేసిన ప్రతిపాదనకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సానుకూలంగా స్పందించింది. ప్రజల ప్రయోజనాలను కేవలం సాయుధపోరాటం ద్వారానే కాకుండా ఇతర శాంతియుత మార్గాల్లోనూ సాధించవచ్చని వారు స్పష్టం చేశారు. తీవ్రమైన పోరాటంలో చిక్కుకున్నా మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధంగా ఉండడం వారి రాజకీయ పరిణతిని, ప్రజలపట్ల వారికున్న నిబద్ధతను తెలుపుతోంది. కేవలం ఆదివాసీల గురించే కాకుండా ఆదివాసీయేతర ప్రజల ప్రయోజనాల గురించి కూడా వారు ఆలోచిస్తున్నారు. శాంతి చర్చలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడితే, పాలకుల అభివృద్ధి నమూనా తెచ్చిన మారణహోమం, రాజ్యాంగ పాలనలో నెలకొన్న సామాజిక, సాంస్కృతిక ఆందోళనల గురించి కూడా చర్చించడానికి వారు సిద్ధంగా ఉన్నారు. మతపరమైన మైనారిటీలపై జరుగుతున్న వివక్ష, ఆదివాసీ, ఆదివాసీయేతర ప్రజల సాంస్కృతిక సంప్రదాయాల రక్షణ గురించి వారు గళం విప్పుతున్నారు. పౌరుల ప్రాణాలకు అత్యంత విలువనిస్తూ, మావోయిస్టులు శాంతి చర్చలకు సుముఖత వ్యక్తంచేయడం వారి మానవత్వాన్ని చాటుతోంది. ఆరు రాష్ట్రాల్లో భీకర యుద్ధం కొనసాగుతున్నా, పౌర సమాజం హృదయపూర్వక పిలుపునకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ వెంటనే స్పందించడం గమనార్హం. చర్చలతో తమకు లాభం చేకూరుతుందా లేదా అనే స్వార్థపూరిత ఆలోచనను పక్కనబెట్టి, శాంతి ప్రతిపాదన వచ్చినప్పుడల్లా మావోయిస్టులు సానుకూలంగా స్పందించడం వారి చిత్తశుద్ధిని, ప్రజల పట్ల వారికున్న బాధ్యతను తెలుపుతోంది.

# దార్శనికుడు శేఖర్ బాబు



పందిళ్ళ శేఖర్‌బాబు (ఆగష్టు 15, 1961 – ఏప్రిల్ 24, 2015) రంగస్థల (పౌరాణిక) నటుడు, దర్శకుడు, నిర్వాహకుడు. ఆయన 1961, ఆగష్టు 15 వ తేదీన వరంగల్ జిల్లా, ధర్మసాగర్లో రాజయ్యశాస్త్రి, సుచేత దంపతులకు జన్మించారు. బాల్యమంతా ధర్మసాగరంలోనే గడించింది. హనుమకొండలో ఇంటర్మీడియట్ చదివారు. అనంతరం దేవాదాయ ధర్మదాయ శాఖలో ఉద్యోగిగా చేరడం, కార్యనిర్వహణాధికారిగా ఉన్నతస్థానం సాధించడం అన్ని వరంగల్‌లోనే జరిగాయి. అంతటితో ఆగకుండా కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ చదివి, ఆ తరువాత ఎల్.ఎల్.బి. చేశారు. పందిళ్ళ శేఖర్‌బాబు తన 12వ ఏట 1973లో ఆత్మహత్య సాంఘిక నాటికలో సన్యాసి రాజు పాత్రతో రంగ ప్రవేశం చేసారు. తొలి ప్రయత్నంలోనే బహుమతుల (ద్వితీయ ఉత్తమ నాటిక, ఉత్తమ నటుడు) ను అందుకున్నారు. నాటక ప్రవేశం సాంఘిక నాటిక ద్వారా జరిగినా ఈయనకు పేరు తెచ్చినవి మాత్రం పౌరాణికాలు. 1997వ సంవత్సరం మార్చి 1న ఈయన పౌరాణిక నాటక రంగంలోకి అడుగు పెట్టారు. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో, శ్రీకృష్ణ పాత్రలో ప్రేక్షకులను అలరించారు. రవీంద్రభారతి, తెలుగు విశ్వ విద్యాలయం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైద్రాబాద్), మహతి (తిరుపతి), హనుమంతరాయ గ్రంథాలయం, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల కళావేదిక (విజయవాడ), శ్రీ వేంకటేశ్వర విజ్ఞానకేంద్రం (గుంటూరు) మొదలైన ప్రముఖ వేదికలపై, ఇతర ప్రాంతాల్లో దాదాపు 500 నాటక ప్రదర్శనల్లో నటించారు. శ్రీకృష్ణ రాయబారంలో శ్రీకృష్ణుడిగా, అర్జునుడిగా, దుర్యోధనుడిగా, శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణుడిగా, నారదుడిగా, శ్రీరామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడిగా, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడిగా, గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడిగా, అర్జునుడిగా, అక్రూరుడిగా, నారదుడిగా,లవకుశలో రాముడిగా,యయాతిలో యయాతిగా,చింతామణిలో బిల్వ మంగళుడిగా, భవానీ శంకరుడిగా,బభ్రువాహనలో అర్జునుడిగా, అన్నమయ్యగా నటించారు. 1998లో తెలుగు పద్యాన్ని బ్రతికించండి– పద్యనాటక మనుగడకు సహకరించండి అనే నినాదంతో 'తెలంగాణా డ్రమెటిక్ అసోసియేషన్'ను స్థాపించారు. ఈ సంస్థ, ఒకవైపు ప్రసిద్ధమైన నాటకాలను ప్రదర్శిస్తూ, మరోకవైపు ఎంతో సమర్థవంతంగా నాటక పోటీలను నిర్వహిస్తూ వచ్చింది. రాష్ట్రంలోని ఎన్నో పట్టణాలలో ఎన్నో ప్రదర్శనల్ని దిగ్విజయంగా ప్రదర్శించి, ప్రేక్షకుల్ని పరవశింప జేసింది తెలంగాణా డ్రమెటిక్ అసోసియేషన్. 2007లో 'శ్రీకృష్ణరాయబారం' నాటకానికి ఉత్తమ నటుడు, ఉత్తమ పద్యపఠనం విభాగాలలో రెండు గరుడ అవార్డులు (స్వీయ దర్శకత్వం), 2011లో 'యయాతి' నాటకానికి ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ పాత్రోచిత నటుడు విభాగాలలో మూడు గరుడ అవార్డులు (స్వీయ దర్శకత్వం), 2012లో యయాతి' నాటకానికి ఉత్తమ నటుడు, ఉత్తమ సంగీతం విభాగాలలో రెండు గరుడ అవార్డులు, 'బభ్రువాహన' పద్య నాటికకు తృతీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి, ఉత్తమ పాత్రోచితనటి విభాగాలలో మూడు గరుడ అవార్డులు లభించడంలో ఆయన కృషి ఎంతో ఉంది. నటులకు ప్రోత్సాహాన్నిచ్చి, వివిధ పరిషత్తులతోపాటు, ప్రముఖ వేదికలపై నాటకాల నిర్వాహణ, దర్శకత్వ బాధ్యతల నిర్వాహణ గావించారు. 2008 నుండి 'వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక' అధ్యక్షునిగా, ప్రతి యేటా క్రమంతప్పకుండా నాటిక పోటీలను నిర్వహించారు. 'రంగస్థల కళాకారుల క్రెడిట్ సొసైటీ'ని నిర్వహిస్తూ, తద్వారా వచ్చే లాభాలు, వడ్డీల నుండి 50 శాతం 'ఐక్యవేదిక'కు కేటాయించి, సంస్థకు ఆర్థికంగా పరిపుష్టం గావించారు. న్యాయ నిర్ణేతగా ఆయన నిర్ణయం నిష్పాక్షికమైనది. రాగద్వేషాలకు తావీయకుండా, ప్రతిభకు పట్టంకట్టడంలో ఆయనది అందెవేసిన చేయి. అందుకే రాష్ట్రంలోని ఎన్నో పరిషత్తులు నాటక పోటీలకు గుణనిర్ణేతగా ఆయయను ఆహ్వానించి గౌరవిస్తున్నాయి. 2008లో రాజమండ్రి లో జరిగిన నంది నాటకోత్సవాలకు పౌరాణిక నాటక విభాగంలో ప్రాథమిక న్యాయ నిర్ణేతగా 2009, 2011 సంవత్సరంలో అభినయ పరిషత్ వారు నిర్వహించే హనుమ అవార్డుల పోటీల పౌరాణిక నాటక విభాగంలో న్యాయ నిర్ణేతగా, 2012లో రవీంద్రభారతిలో జరిగిన పి.ఎం.కె.ఎం. సాంఘీక నాటకపోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. శేఖర్ బాబు నిర్విరామ కృషికి, దీక్షాదక్షతలను గుర్తించిన అనేక సంస్థలు ఆయనకు నటశేఖర, పౌరాణిక నట సార్వభౌమ, పౌరాణిక విద్వన్మణి, మెగా సిటిజన్, శ్రీపాద నాటక కళాపరిషత్ వారి పురస్కారం, పద్యనాటక కళాధురీణ వంటి బిరుదులనిచ్చి సత్కారం చేశాయి. 2000 సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీ నుండి 11వ తేదీవరకు 7రోజుల పాటు వరుసగా ఒకే వేదికపై శ్రీకృష్ణ రాయబారం, లవకుశ, సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, చింతామణి, గయో పాఖ్యానం, శ్రీరామాంజనేయ యుద్ధం నాటకాలను 'పద్య నాటక సప్తాహం' పేరిట, ఏడు రోజులు వరుసగా ప్రదర్శించి, ప్రధాన పాత్రలను ధరించారు. 2011లో మరలా 'పద్యనాటక సప్తకం ' నిర్వహించి స్వీయ దర్శకత్వంలో 7 నాటకాలను, వారానికొకటి చొప్పున ప్రదర్శించి, ప్రధాన పాత్రలు ధరించి, నిర్వాహణ వ్యయం 3 లక్షలు భరించారు. 2012లో తొలి తెలుగు సినీ రచయిత, 'పరబ్రహ్మ పరమేశ్వర' ప్రార్థనా గీత రచయిత చందాల కేశవదాసు 136వ జయంతి ఉత్సవం తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం (హైద్రాబాద్) లో నిర్వహించారు. 2010లో అజో–విభో ఫౌండేషన్ వారు వరంగల్ లో నిర్వహించిన, 'సాహితీమూర్తి పురస్కారం' డా. నల్లాన్ చక్రవర్తుల రఘునాథ చార్యులకు ప్రదానం చేసిన కార్యక్రమాన్ని కలిసి నిర్వహించారు. అనారోగ్య కారణాల వల్ల హైదరాబాద్ లో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఏప్రిల్ 24, 2015 న మరణించారు.

# సినిమా పుస్తకంలో అరుదైన సంతకం ఏడిద

ఏడిద నాగేశ్వరరావు (ఏప్రిల్ 24, 1934 – అక్టోబరు 4, 2015) ప్రముఖ తెలుగు సినిమా నిర్మాతలలో ఒకరు. సమున్నత ఆశయాలతో అరుదైన చిత్ర నిర్మాణాలను చేసి తెలుగు చిత్ర సీమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించి, ప్రత్యేక గుర్తింపు పొందారు. సినీ పుస్తకంలో ఒక చెరగని సంతకంగా మిగిలి పోయారు.ఆయన నిర్మించిన సినిమాలు తక్కువే... అయితేనేం అన్నీ ఆణి ముత్యాలే. చిరకాలం ప్రజల హృదయాలలో నిలిచి పోయేవే. ఆయన నిర్మించిన చిత్రాలన్నీ జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకోవడం విశేషం. సుమారు 30 సినిమాల్లో నటించారు. వంద చిత్రాలకి పైగా డబ్బింగ్? చెప్పారు.పాఠశాల జీవితంలో ముఖానికి రంగు పులుముకుని, అమ్మాయి వేషంలో నట జీవితం ప్రారంభించి, తర్వాతి కాలంలో సినీరంగం లోకి అడుగుపెట్టి, నటుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా, నిర్మాతగా ఎదిగిన క్రమం ఆయన అసమాన కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. అయన తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి కార్యదర్శిగా సేవలందించారు. నంది పురస్కారాల కమిటీ అధ్యక్షుడిగా, జాతీయ పురస్కారాల కమిటీలో సభ్యుడిగా పని చేశారు. పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ అనే సంస్థ ద్వారా కొన్ని గొప్ప ఆశయాలతో, ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే తెలుగు సినిమాలను నిర్మించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర, భారత ప్రభుత్వాల నుండి ఎన్నో అవార్డులను గెలుచుకున్నారు. ఏడిద నాగేశ్వరరావు తూర్పు గోదావరి జిల్లా, కొత్తపేటలో సత్తిరాజు నాయుడు, పాపలక్ష్మి దంపతులకు 1934, ఏప్రిల్ 24 న జన్మించారు. కాకినాడ మెటలారిన్ హైస్కూల్‌లో ఫిఫ్త్ ఫారమ్ చదువుతుండగా స్కూల్ వార్షికోత్సవంలో లోభి నాటకంలో తొలిసారిగా ఏడిద అమ్మాయి వేషం వేశారు. దానికి సిల్వర్ మెడల్‌ను కూడా అందుకున్నారు. ఆ నటనకు రజత పతకం సాధించిన ఉత్సాహంతో 'విశ్వభారతి, 'పరివర్తన', 'ఓటు నీకే'వంటి నాటకాల్లో నటించి మరిన్ని బహుమతులు పొందారు. ఆ తర్వాత విజయ నగరంలో ఇంటర్‌మీడియట్ చదువుతుండగా 'కవిరాజు మెమోరియల్ క్లబ్'లో కొన్ని నాటకాలు వేశారు. పిఠాపురం రాజాస్ కాలేజీలో బి.ఎ. ఎకనామిక్స్‌లో చేరిన నాగేశ్వర రావుకు అక్కడే దర్శకనిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ పరిచయ మయ్యారు. వి.బి.రాజేంద్ర ప్రసాద్, నటులు హరనాథ్, మాడా, కె.కె.శర్మ, వడ్డాది సూర్యనారాయణ మూర్తిలతో కలిసి కళాప్రపూర్ణ రాఘవ కళాసమితి నాటక సంస్థను ప్రారంభించి ఇన్‌స్పెక్టర్ జనరల్ వంటి పలు నాటకాలు ప్రదర్శించి నటించారు. 26 ఏళ్ళ వయసులో నాగేశ్వరరావు 'కప్పలు' నాటకంలో వృద్ధ పాత్ర పోషించి మెప్పించి నందుకు గానూ ఆయనకు పరిషత్ పోటీలలో బెస్ట్ యాక్టర్ అవార్డు వచ్చింది. తన స్నేహితుడు, నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్? నుంచి 'అన్నపూర్ణ'లో నటించాలని పిలుపు రావడంతో మద్రాస్? వెళ్లారు. కాని, ఆ వేషం దక్కలేదు. డబ్బింగ్? కళాకారుడిగా ప్రయత్నాలు ప్రారంభించారు. 'పార్వతీ కళ్యాణం' లోని శివుడి పాత్రకి డబ్బింగ్? చెప్పి తొలి సంపాదనగా రూ.500 పొందారు. ఆ తర్వాత నటుడిగా కూడా అవకాశాలు సొంతం చేసుకొన్నారు. నిర్మాత కాక ముందు ఆయన నటుడిగా సినీ ప్రస్థానాన్ని ఆరంభించారు. రణభేరి, నేరము శిక్ష, బంగారు బాబు, మానవుడు దానవుడు, చిన్ననాటి స్నేహితులు తదితర చిత్రాల్లో నటించారు. 1962 నుంచి 1974 మధ్య కాలంలో సుమారు 30 సినిమాల్లో నటించారు. వంద చిత్రాలకి పైగా డబ్బింగ్? చెప్పారు. ఆ తర్వాత కాకినాడకి చెందిన భాస్కరరెడ్డి, రామకృష్ణారెడ్డి, లచ్చిరెడ్డి, వీర్రాజులతో కలిసి 'వెంకటేశ్వర కల్యాణం'అనే చిత్రాన్ని తెలుగులోకి అనువదించారు. ఆ సినిమాకి లాభాలు రావడంతో ఆ నలుగురూ కలిసి గీతాకృష్ణ కంబైన్స్ అనే సంస్థను ప్రారంభించి నిర్మాణ సారథ్య బాధ్యతలను ఏడిద నాగేశ్వరరావుకే అప్పగించారు. 'నేరము శిక్ష'లో నటించడంతో ఆ చిత్ర దర్శకుడు కె. విశ్వనాథ్తో పరిచయం ఏర్పడింది. ఆయనతో సిరి సిరి మువ్వ సినిమాను నిర్మించారు. అది విజయం సాధించింది. తర్వాత తన బంధువులతో కలిసి పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ స్థాపించారు. తొలి ప్రయత్నంగా కొమ్మినేని శేషగిరిరావు దర్శకత్వంలో తాయారమ్మ బంగారయ్యను నిర్మించారు. అందులో చిరంజీవి ప్రతినాయక ఛాయలున్న ఓ చిన్న పాత్రని పోషించారు. ఆ సినిమా విజయం సాధించడంతో పాటు తమిళం, హిందీ భాషల్లోనూ రీమేక్? అయ్యింది. నిర్మాణ సారథిగా ఒక విజయాన్ని, నిర్మాతగా మరో విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. మూడో సినిమా కోసం మళ్లీ కె.విశ్వనాథ్?ని సంప్రదించి శంకరాభరణం నిర్మించారు. ఇక ఆ చిత్రం తర్వాత వెనుదిరిగి చూసుకొనే అవకాశం రాలేదు. సీతాకోక చిలుక, స్వాతిముత్యం, సితార చిత్రాలకి వివిధ విభాగాల్లో జాతీయ పురస్కారాలు లభించాయి. 'స్వాతిముత్యం' తెలుగు నుంచి ఆస్కార్? నామినేషన్లకు ఎంపికైంది. చాలా సినిమాలకు వివిధ విభాగాల్లో నంది పురస్కారాలు వరించాయి. చివరిగా 'ఆపద్బాంధవుడు'చిత్రాన్ని నిర్మించారు ఏడిద నాగేశ్వరరావు. 2013, ఏప్రిల్ 11 న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉగాది పురస్కారం అందుకున్నారు. కళా సాగర్ వారు దశాబ్దపు ఉత్తమ నిర్మాత గా అవార్డునిచ్చి సత్కరించారు. సంగం అకాడమీ లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డ్, సంతోషం– లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డు నిచ్చి గౌరవించాయి. ఏడిద నిర్మించిన 9 సినిమాల్లో అత్యధిక చిత్రాలు కె.విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కడం విశేషం. పలు చిత్రాలు రష్యన్ భాషలో విడుదలయ్యాయి. సింగిల్ షెడ్యూల్లో 52 రోజుల్లో రూ.11 లక్షల వ్యయంతో 'శంకరాభరణం'ను నిర్మించారు ఏడిద. జాతీయ స్థాయిలో వ్యూయర్ షిప్‌ను తెచ్చుకున్న సినిమా. ఈ సినిమాను మలయాళం లోకి డబ్ చేశారు. అయితే పాటలను మాత్రం తెలుగులోనే ఉంచారు. ఎర్నాకులం లోని కవితా థియేటర్లో రెండేళ్ళు ఆడింది. అమెరికాలోనూ విడుదల చేశారు. 20 మంది యూనిట్ సభ్యులు అమెరికాలో 45రోజుల పాటు శంకరాభరణం నైట్స్‌ను నిర్వహించారు. తెలుగు సినిమాకు అమెరికాలో అంతగా బ్రహ్మరథం పట్టడం అదే ప్రథమం. జాతీయ స్థాయిలో స్వర్ణకమలం కూడా సాధించింది. ఈస్ట్ ఫ్రాన్స్‌లో సంగీత ప్రధాన చిత్రాలు మాత్రమే పాల్గొనే బెసన్‌కాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమాకు బెస్ట్ ఫిల్మ్ అవార్డు లభించింది. ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్ నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, తమిళనాడు సీఎం ఎంజీ రామచంద్రన్, శివాజీ గణేషన్, కేరళ నాటి సీఎం తదితరులు వీక్షించి ప్రశంసల వర్షం కురిపించారు. కమర్శియల్ సినిమా హవా నడుస్తోన సమయంలో ఈ సినిమా అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. తర్వత దేశ, విదేశాల్లో ఎన్నో అవార్డులను కొల్లగొట్టింది. ఆ తర్వాత భారతిరాజా దర్శకత్వంలో 'సీతాకోక చిలుక'ను నిర్మించారు. అది జాతీయ స్థాయిలో 'ఉత్తమ ప్రాంతీయ చిత్రం'గా రజత పతకాన్ని, రాష్ట్ర స్థాయిలో బంగారు నందిని అందుకుంది. అలీకి ఈ సినిమాకు ఉత్తమ బాలనటుడు అవార్డు లభించింది. ఆ తర్వాత ఆయన తెరకెక్కించిన సినిమా 'సాగర సంగమం'. బెంగుళూరులో 575రోజుల అరుదైన రికార్డును సొంతం చేసుకున్న సినిమా అది. నేటివిటీ మార్పులతో తెలుగు, తమిళ్, మలయాళంలో ఒకేసారి విడుదలైన సినిమా ఇది. తమిళంలో 'సలంగై ఒళి' పేరుతోనూ మలయాళంలో 'సాగర సంగమం' అనే పేరుతోనే విడుదలైంది సినిమా. ఇండియన్ పనోరమకు ఎంపికైంది. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం కు ఉత్తమ గాయకుని గా జాతీయ అవార్డు వచ్చింది. ఆపద్బాంధవుడు (1992), స్వర కల్పన (1989), స్వయం కృషి (1987), సిరి వెన్నెల (1986), స్వాతి ముత్యం (1985), సాగర సంగమం (1983), సితార (1983), సీతాకోక చిలుక (1981), తాయారమ్మ బంగారయ్య (1979), శంకరాభరణం (1979), సిరిసిరి మువ్వ (1978), తదితర చిత్రాలను ఆయన నిర్మించారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదు లోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2015 అక్టోబరు 4న, ఆదివారం మూశారు.

# ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





**నిజాంపేట,ఏప్రిల్23(సూర్యరేఖ)** మండల పరిధిలోని నందగోకుల్, తిప్పనగుళ్ల గ్రామాలలో బుధవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకెపి నిర్వాహకులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామంలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని,రైతులు దళారుల నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం తరలించేటప్పుడు నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో సీసీ లక్ష్మి స్వరూప,అధ్యక్షురాలు నర్మద,వివోఏ మంగా మంజుల వాణి సాగరిక మమత,గౌరీ రేణుక లావణ్య,మంగలిపల్లి యాదగిరి మల్లేశంగౌడ్ నాగులు స్వామి ఎల్లం,బుష్ రెడ్డి రమేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వరద నీటి నాలా పూడికతీత పనులను ప్రారంభించిన నాలాలో వ్యర్థపదార్థాలు,మట్టిని వేస్తున్న టిప్పర్లను సీజ్ చేయండి





**కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు**

**ఉప్పల్,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)** రామంతపూర్ డివిజన్ పరిధిలోని వరదనీటినాల పూడికతీత పనులను బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రాత్రి వేళల్లో నాళాల్లో మట్టి ఇతర వ్యర్థాలను టిప్పర్ల ద్వారా తెచ్చి పారబోస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని వ్యర్థాలు నాలాలో పారబోస్తున్న వారి టిప్పర్లను ట్రాక్టర్లను జప్తు చేసి భారీ ఎత్తున జరిమానాలను విధించాలని ఆమె అధికారులకు సూచించారు. నాలా పూడికతీత పనులను తాను ప్రతిరోజు పరిశీలిస్తుంటానని అదేవిధంగా అధికారులు కూడా పర్యవేక్షించాలని పూడికతీత పనుల్లో నాణ్యత లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ ఇంజనీర్ నాగమణి,అసిస్టెంట్ ఇంజనీర్ శ్వేత,వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్, బిజెపి నేతలు నాగేష్ నిరంజన్,తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రజితోత్సవ సభను జయప్రదం చేయాలి





**ఇంటింటికి తిరుగుతూ బొట్టు పెడుతూ ఆహ్వాన పత్రికలు అందజేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి,కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి, లు**

**ఉప్పల్,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జమ్మిగడ్డలో ఇంటింటికి తిరుగుతూ బొట్టు పెడుతూ 25 ఏళ్ల గులాబీ పండుగ మన ఇంటి పార్టీ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఆహ్వాన పత్రికలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఏప్రిల్ 27న వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కావాలని ఇంటిటికి తిరుగుతూ బొట్టు పెడుతూ ఈ నెల 27న వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు తప్పకుండ రావాలని ఇంటిటికి ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది.ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...ఏప్రిల్ 27న 25 ఏళ్ల గులాబీ పండుగకు ప్రతి ఒక్కరు వచ్చి సభను విజయవంతం చేయాలని,తెలంగాణ ప్రజల కోసం పాటుపడేది బీఆర్ఎస్ పార్టీ అని,కేసీఆర్ వస్తేనే మళ్ళీ తెలంగాణ బాగుపడ్తుందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే ప్రతి ఒక్కరి సంక్షేమ పథకాలు అందుతాయని, కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని,మళ్ళి తెలంగాణలో కేసీఆర్ పాలనే రావాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు ప్రతి ఇంటికి తిరుగుతూ బొట్టు పెడుతూ ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో సిసి రోడ్డు పనులు ప్రారంభం..



**నిజాంపేట,ఏప్రిల్23(సూర్యరేఖ)** మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో అంతర్గత రోడ్లు బాగోలేనందున బుధవారం గ్రామ కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా సిసి రోడ్డు పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో గ్రామంలో రూ.12.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామన్నారు.సీసీ రోడ్లకు సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి మసూద్అలీ భాస్కర్ గౌడ్,రంగా రమేష్,నెరేళ్ల భిక్షపతి. కిష్టయ్య. కైరంకొండ బాలయ్య రత్నగారి కృష్ణారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సెకండియర్ లో ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన మండల వాసిని



**నిజాంపేట,ఏప్రిల్23(సూర్యరేఖ)** ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం టీజీఎస్డబ్ల్యూ ఆర్ఎస్ జె కాలేజ్ రామాయంపేట పరీక్షా ఫలితాల్లో రెండవ స్థానంలో నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన నవనీత 976 మార్కులను సాధించింది.దీంతో కాలేజీ యాజమాన్యంతో పాటు మండల గ్రామ ప్రజలు నవనీత,ను అభినందించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే మంచి మార్కులు సాధించానన్నారు.

## అలింకా సంస్థ వారి ఆధ్వర్యంలో దివ్యాంగుల పరికరాలు అందజేత..



**నిజాంపేట,ఏప్రిల్23(సూర్యరేఖ)**అలింకా సంస్థ వారు దివ్యాంగులైనటువంటి విద్యార్థులకు ముందస్తుగా క్యాంపులను నిర్వహించి వివిధ రకాల పరికరాలను దివ్యాంగులకు అందించడం జరుగుతుంది.దీనిలో భాగంగా నిజాంపేట మండలానికి సంబంధించిన విద్యార్థులకు కొన్ని రకాల పరికరాలను మండల విద్యాధికారి యాదగిరి,చేతుల మీదుగా బుధవారం విద్యార్థులకు అందజేశారు.దివ్యాంగులుగా ఉన్నటువంటి విద్యార్థులు ఫిజియోథెరపీ సేవలను కూడా ఉపయోగించుకోవాలన్నారు.అలింక సేవలను అనుదినం అందిస్తున్న ఐఈఆర్ పిలు నరేష్,రాజయ్య రాజేందర్, శ్రీనివాస్,శ్రీలత,తదితలు పాల్గొన్నారు.

## భగ్గుమంటున్న బంగారం ధరలు

**హైదరాబాద్ :** బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. పెళ్లి కూతురి మెడలో మెరిసే పసిడి, పేదింటి తల్లిదండ్రులకు కన్నీటి చుక్కలా మారుతోంది. తులం బంగారం లక్ష రూపాయలు పలుకుతుండటంతో, సామాన్యుడికి అది అందని ద్రాక్షలా తయారైంది. ఒకప్పుడు తమ స్థాయికి తగ్గట్టుగా బంగారు ఆభరణాలు కొని కూతుళ్లకు కానుకగా ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీంతో చాలామంది పాత బంగారం అమ్మి, తక్కువ మొత్తంలో కొత్త ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ ట్రెండ్ పెరిగిపోవడమే కాకుండా, తక్కువ క్యారెట్ల బంగారం వైపు మొగ్గ చూపుతున్నారు..పల్లెటూర్లలో బంగారానికి ఉన్న ప్రాధాన్యత ప్రత్యేకమైనది. అది కేవలం అలంకరణ వస్తువు మాత్రమే కాదు, గౌరవానికి, సంపదకు చిహ్నం. పెళ్లిళ్లలో బంగారు ఆభరణాలు ఒక ముఖ్యమైన ఆచారం. ఒకప్పుడు పెళ్లి అంటే ఇరు కుటుంబాల వారు తమ ఆర్థిక స్థోమతను చాటుకునేందుకు పోటీపడి బంగారం కొనేవారు.

# కాశ్మీర్ లో పర్యాటకులపై దాడిని ఖండించిన గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి




**హైదరాబాద్,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)**కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని కమిటీ అధ్యక్షుడు ఎం. నరసయ్య తెలిపారు.బుధవారం నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడిని పిరికిపందల చర్యగా అభివర్ణిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.చనిపోయిన వారికి, గాయాలైన వారికి ప్రభుత్వం అండగా ఉండి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కాశ్మీర్లో చిక్కుకుపోయిన టూరిస్టులందరినీ వెంటనే తమ తమ స్వస్థలాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాన్ని దేనిని ఆయన అన్నారు.తెలంగాణ ప్రాంతానికి చెందిన సుమారు 500 మంది కాశ్మీర్లో ఉన్నారని వారిని వెంటనే హైదరాబాద్ తీసుకు రావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీసుకోవాలని నరసయ్య పేర్కొన్నారు. హోటలలో బిక్కుబిక్కుమంటూ ఉన్న ప్రయాణికులను ప్రత్యేక విమానాలలో తరలించాలని విజ్ఞప్తి చేశారు. నగరవ్యాప్తంగా కాశ్మీర్లో చనిపోయిన కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించాలని నర్సయ్య పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అబ్జల్జన సమితి నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, సురేష్ కుమార్,హనుమంత్ గౌడ్ భాష రసూల్, మాణిక్యం భాస్కర్ అశ్వక్ గోవింద్ సింగ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ లో పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

### తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్,డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య




**తుర్కయంజాల్,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)** తుర్కయంజాల్ కేంద్రంలోని పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్,డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య తుర్కయంజాల్ పోచంపల్లి బ్యాంక్ బ్రాంచ్ నూతన ప్రారంభోత్సవం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ..ఆర్బిఐ అనుమతితో బ్యాంకు నిబంధనలు పాటిస్తూ పోచంపల్లి బ్యాంక్ 1997లో పోచంపల్లి గ్రామంలో నూతనంగా ప్రారంభించబడిందని అంచలంచెలుగా ఎదుగుతున్న అన్నారు. నూతన శాఖను తుర్కయంజాల్ లో ప్రారంభించడం శుభపరిణామం అన్నారు.పోచంపల్లి బ్యాంకులో బంగారు ఆభరణములపై రుణాలు, వ్యాపార అభివృద్ధికి రుణాలు,ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం,హౌసింగ్ లోన్స్,రైతులకు క్రాప్ లోన్స్, ఆల్ వెహికిల్ లోన్స్ పొందే అవకాశం ఉందన్నారు. పోచంపల్లి అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు తడక రమేష్ మాట్లాడుతూ...పోచంపల్లి బ్యాంకు సేవలు మరింతగా విస్తృత పరుస్తామన్నారు.పోచంపల్లి బ్యాంక్ జాతీయ స్థాయిలో ఎన్నో ఉత్తమ బ్యాంక్ అవార్డులను పొందిందనన్నారు. తుర్కయంజాల్ పరిసర ప్రాంత ప్రజలు,ఉద్యోగ,వ్యాపారస్తులు పోచంపల్లి బ్యాంక్ సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు..పోచంపల్లి బ్యాంక్ జాతీయ స్థాయిలో ఎన్నో ఉత్తమ బ్యాంక్ అవార్డులను పొందిందనన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ ధనరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు భీమ్ రెడ్డి,పోచంపల్లి బ్యాంక్ వైస్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు,బ్యాంక్ సీఈఓ సీత శ్రీనివాస్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



**కామారెడ్డి,ఏప్రిల్ 23(సూర్యరేఖ)** బీజేవైఎం కామారెడ్డి కేంద్రంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు,బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేసినట్లు పేర్కొన్నారు.అనంతరం జిల్లా అధ్యక్షుడు నంది వేణు,బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూర,లు మాట్లాడుతూ దక్షిణ కాశ్మీర్లోని పహల్గామ్లో హిందువులని నిర్ధారించుకున్న తర్వాత వాళ్లను కాల్చి చంపేశారన్నారు.కొన్ని రాజకీయ పార్టీలు హిందువులను జెండాలు మోసే బానిసలుగానే చూస్తున్నాయని ఇప్పటికైనా కూడా హిందువులు మేల్కొని సంఘటితమై ఈ దేశాన్ని ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. ఇప్పటికైనా ప్రతి ఒక్క హిందువు సంఘటితమై ఉగ్రవాదులు,దేశంలో సెక్యూలరిజం ముసుగులో ఉన్న రాజకీయ పార్టీలను బొంద పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదులు యాత్రికులపై దాడి చేసేటప్పుడు వారిని హిందువులుగా గుర్తించి హిందువులను మాత్రమే దాడి చేసి చంపి,ప్రధానికి హెచ్చరికలు జారీ చేస్తున్నట్టు చెప్పడాన్ని ప్రతి హిందువు అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రాంతాల పేరిట,కులాల పేరిట,భాషల పేరిట హిందువుల విడి పోతే,ఉగ్రవాదులు మాత్రం ఏ ప్రాంతం,ఏ భాష,ఏ కులము అని చూడకుండా కేవలం హిందువులు అయితే చాలు వారిని చంపేశారని,ఇకపై అయినా హిందువులు ఐక్యంగా ఉండాలని సూచించారు.ఉగ్రదాడిని ఉపేక్షించేది లేదని,సాధ్యమైనంత తొందరలోనే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇంతకు రెట్టింపు ప్రతీకార దాడులు జరుపుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు.గత 11 సంవత్సరాలుగా నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులు,నక్సలైట్లను అణిచివేయటానికి పక్కా ప్రణాళికతో ముందుకు పోతుందని,కాంగ్రెస్ కొన్ని ప్రాంతీయ పార్టీల ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని అయినప్పటికీ త్వరలోనే భారత దేశంలో ఉగ్రవాదులను తుదముట్టిస్తామని అన్నారు.ఈ కార్య క్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నరేదర్రెడ్డి,నాయకులు శ్రీనివాస్,నారేదర్,సంతోష్ రెడ్డి,సురేష్,ప్రవీణ్,మహేష్,రాజేష్,భూమేష్ రాజ్, గోపాల్,బలమని లక్ష్మీపతి,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య..పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు..

**చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి..**

**మండల విద్యాధికారి గోపాల్**





**పరిగి,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)** ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం చివరి వర్కింగ్ డే కావడంతో వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్ట కోడూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రధానోపాధ్యాయులు ఎండి ఉస్మాన్ అలీ అధ్యక్షతన ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పరిగి మండల విద్యాధికారి గోపాల్ హాజరయ్యారు.పాఠశాల ప్రాంగణమంతా తిరిగి రాబోయే అకాడమిక్ సంవత్సరంలో విద్యార్థులకు పాఠశాలకు కావాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులందరికీ ప్రగతి పత్రములు (ప్రోగ్రెస్ కార్డ్స్) అందజేశారు. గురుకుల పాఠశాలలలో మొదటి విడుదలలోనే సీట్లు సాధించిన గీతా, తపస్విని,వైష్ణవి,ని వారి తల్లిదండ్రులను శాలువాతో సన్మానించి బహుమతులు అందజేశారు. అనంతరం మండల విద్యాధికారి మాట్లాడుతూ ..విద్యార్థుల బంగారు భవిష్యత్తు ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగ్గా ఉంటుందని,ప్రభుత్వ పాఠశాలలో అన్ని విధాలుగా మెరుగైన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోని చేర్పించాలని,ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన జరుపుతూ విద్యార్థులలో మానవతా విలువలు,ఉన్నతమైన విద్య ప్రమాణాలు,నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్న మన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే మీ పిల్లలను చేర్పించాలని తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు మాణిక్యం, జహీరాబి జహంగీర్,మాజీ ఉపసర్పంచ్ నరసింహులు,అమ్మ ఆదర్శ కమిటీ చైర్పర్సన్ శ్రీమతి అనురాధ,గ్రామ మహిళ సంఘాల అధ్యక్షురాలు అనిత,పాఠశాల ఉపాధ్యాయులు ఏ.కృష్ణయ్య,ఎన్. నర్సింలు,రాజు,కవిత,శిక్షణ ఫౌండేషన్ మెంటర్ హనుమంతు,అంగన్వాడీ టీచర్స్ శ్రీమతి పద్మమ్మ , చంద్రకళ,విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చల్మెడలో 33/11 కెవి సబ్ స్టేషన్ పనుల పర్యవేక్షణ..



**నిజాంపేట,ఏప్రిల్23(సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్నటువంటి 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పనులను బుధవారం ఏఈ నారాయణ,శ్రీకాంత్,ఏడి కిషన్,సబ్ ఇంజనీర్ శివకుమార్,లు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామంలో సబ్ స్టేషన్ స్థలాన్ని పర్యవేక్షించామన్నారు. త్వరతగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహెూత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)**నాచారం రవీంద్రనగర్ లోని సాయిబాబా దేవాలయంలో నూతనంగా శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా జరిగింది.ఆలయంలో నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి,నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్,లు పాల్గొన్నారు.అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్,లను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్,నరసింహ,దామోదర్ రెడ్డి,శ్రీశైలం యాదవ్,హరికిషన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి



**నిజాంపేట,ఏప్రిల్23(సూర్యరేఖ)**మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీటీసీ నంద్యాల బాల్ రెడ్డి కుమారుడి వివాహానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో రాజశేఖర్రెడ్డి బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి,పప్పుల కిష్టారెడ్డి భాస్క రరావు, అబ్దుల్ అజీజ్,దయాకర్, బిజ్జా సంపత్,ఆకుల మహేష్ నాయిని లక్ష్మణ్, పెంటయ్య,సిద్ధ రాములు,వెంకట స్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి అవగాహన సదస్సును విజయవంతం చేయండి తహసిల్దార్ రమ్యశ్రీ..




**నిజాంపేట,ఏప్రిల్23(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని తహసిల్దార్ నాగిళ్ళ రమ్య శ్రీ తెలిపారు.ఈ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డిఓ రమాదేవి,హాజరుకానున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# భూభారతితో భూములు భద్రం అని రైతులకు అవగాహన కల్పించినజిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**చేగుంట,ఏప్రిల్ 23(సూర్యరేఖ)** రైతుల భూమి వివాదాలను పరిష్కరించి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.బుదవారం మెదక్ జిల్లా చేగుంట మండలం రైతు వేదిక వద్ద నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కలెక్టర్ రాహుల్ రాజ్, తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి,తాహసిల్దార్ శ్రీకాంత్ సంబంధిత రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు భూభారతిపై కళా ప్రదర్శనలు నిర్వహించారు.ముందుగా భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రివర్యుల సందేశం రైతులకు,ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్ల పై భూ భారతి చట్టం ప్రకారం ఆప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని,నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు.అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్ళవచ్చుని, దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.వారసత్వం లేదా వీలు నామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి హక్కుల రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని,నిర్ణిత గడువు లోగా పూర్తి చేయకుంటే ఆటోమేటిక్ గా మ్యూటేషన్ జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి చేగుంట తాహసిల్దార్ శ్రీకాంత్,మండల రైతులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ సభ్యత్వం అంటే ఓ గౌరవం







**తెలుగుదేశం సభ్యత నమోదు కార్డులు పంపిణీ కార్యక్రమం..**
**ముఖ్యఅతిథిగా టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి. మనిరామ్ సింగ్**

**బెల్లంపల్లి,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)**పేద ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వం అంటే ఓ గౌరవమని టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి. మనిరామ్ సింగ్ అన్నారు.బెల్లంపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ బెల్లంపల్లి పట్టణంలోని తెలుగు దేశం పార్టీ అనుబంధ కార్మిక సంఘం టిఎన్టియుసి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర టిడిపి అధ్యక్షులు బక్కని నర్సింలు,పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకులు వేజెండ్ల కిషోర్ కుమార్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి తెలుగుదేశం పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది ఇట్టి కార్యక్రమాన్ని టిడిపి టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.మణిరామ్ సింగ్ ప్రారంభించి కార్డులను పలువురికి పంపిణీ చేశారు.అనంతరం మాట్లాడుతూ...బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసినటువంటి తెలుగుదేశం పార్టీ ఎన్నో సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో ఐటి సింగరేణిలో పరుగు పందెం ద్వారా 35 వేల నుంచి 40 వేల వరకు ఉద్యోగాలు భర్తీ చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. ప్రపంచ దేశాలలో ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినటువంటి తెలుగుదేశం పార్టీ మహిళలకు 33% రిజర్వేషన్ డ్వాక్రా గ్రూపు ద్వారా మహిళలకు లోన్లు ఇవ్వడం ఒంటరి మహిళలు, వృద్ధులు వితంతువులకు పెన్షన్లు ఇచ్చినటువంటి ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు అణగారిన వర్గాలకు చేయూతనిచ్చినటువంటి పార్టీ తెలుగు దేశం పార్టీ అని,నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సహకరించిన ఏడు మండలలకు సహకరించిన నాయకులు కార్యకర్తలకు టిడిపి తరఫున ధన్యవాదాలు తెలిపారు.తెలుగు దేశం పార్టీ రానున్న రోజులలో పూర్వవైభవం సంతరించుకుంటుందని,దీనికోసం నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు.వివిధ మండలాలలో నియోజకవర్గంలో పర్యటించి ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కరించే దిశగా ప్రతి నాయకులు పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు, సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.మణిరాం సింగ్,ఉపాధ్యక్షులు గద్దల నారాయణ బుల్లు మల్లయ్య,సిహెచ్ రమేష్, ఎస్.కె అజ్గర్ పాషా,యండి యాసీన్ గైన తిరుపతి,మాదాసి, గోపాల్,బుల్లు సత్యనారాయణ దాగం పోశం,ఏం. రాజయ్య లతీఫ్ ఏం.రాజయ్య పుల్లూరి పోచం, కొత్తూరు నారాయణ, ఎస్.ఎస్. పాండే,ఆర్.గంగాధర్ గౌడ్ ఏ.సదానందం వెంకటేశ్వరగౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దాం...

**ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**
**శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఘన స్వాగతం12 వేల కోట్ల పెట్టుబడులు..**
**సుమారు 30వేల ఉద్యోగాలు..**
**ముగిసిన సీఎం రేవంత్ రెడ్డి జపాన్ టూర్..**



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 23**జపాన్‌లో వారం రోజుల పర్యటన ముగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందానికి కాంగ్రెస్ శ్రేణులు ఆధ్వర్యంలో భారీ స్వాగత సత్కారాలు ఏర్పాటు చేశారు.శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ప్రత్యేకంగా కలుసుకొని పూల బొకేతో స్వాగతం పలికారు. జపాన్ పర్యటనను విజయవంతంగా ముగించుకొని రాష్ట్రానికి నూతన భవిష్యత్తును అందజేసే క్రమంలో నియోజకవర్గ ప్రజల తరఫున ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.ఈనెల 15న హైదరాబాద్ నుంచి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారులు,జపాన్?లో వివిధ నగరాల్లో ప్రముఖ సంస్థల అధిపతులతో భేటీ అయ్యారు.ఈ పర్యటనలో మొత్తం 12 వేల 62 కోట్ల రూపాయల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి.వీటి ద్వారా తెలంగాణలో దాదాపు 30,500 ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కంఠరెడ్డి తిరుపతి రెడ్డి..



**నిజాంపేట,ఏప్రిల్23(సూర్యరేఖ)**మండల కేంద్రంలోని రేణుక మాత ఫంక్షన్ హాల్ లో రజాక్ పల్లి మాజీ సర్పంచ్ జీడి నారాగౌడ్, మంగమ్మల మనమరాలు వివాహానికి బుధవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంఠరెడ్డి తిరుపతిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బాపురెడ్డి,మాజీ సర్పంచ్ సంగుస్వామి,నారాగౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు అఘోరీ అరెస్టు..యూపీ నుంచి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు





**మణికొండ,ఏప్రిల్ 23(సూర్యరేఖ)**తెలుగు రాష్ట్రాల్లో గత కొంత కాలంగా సంచలనంగా మారిన అఘోరీని పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. గత కొన్ని రోజులుగా మాయ మాటలు చెప్పి పలువురిని మోసగిస్తున్న అఘోరి శ్రీనివాసను ఉత్తరప్రదేశ్‌లో బుధవారం తెల్లవారుజామున నార్సింగ్ పోలీసులు అక్కడ అరెస్టు చేశారు.అనంతరం అఘోరిని నార్సింగ్ పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి ఏసిపి జీవి రమణ గౌడ్ సమక్షంలో విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. పూజల పేరుతో ఓ మహిళ నుండి రూ.10 లక్షలు కాజేసి మోసం చేసిన కేసులో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.ఇప్పటికే అఘోరి మోసాల పట్ల ఆధారాలు సేకరించిన పోలీసులు..అతని ద్వారా మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే నార్సింగ్ పోలీసులు ఆశ్రయించాలని సూచించారు.

## జమ్ము కాశ్మీర్ అమరవీరులకు నివాళి..



**బెల్లంపల్లి,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)**తాండూర్ మండల కేంద్రంలోని ఐబిలో హిందూ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం వద్ద ఉగ్రవాదుల దాడిలో మరణించిన అమరవీరులకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా హిందూ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ...ఉగ్రవాదుల చర్య పిరికి పంద చర్య అని అన్నారు.భారత ప్రభుత్వం తప్పకుండా ఉగ్రవాదులపై ప్రతిదాడి చేసి తగిన బుద్ధి చెబుతుందని అన్నారు. హిందువులను టార్గెట్ చేసి దాడి చేయడాన్ని హిందూ సమాజం ముక్తకంఠంతో ఖండిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పులగం తిరుపతి,చిలుముల శ్రీకృష్ణదేవరాయలు,దూడపాక భరత్ కుమార్ శంకర్ గౌడ్,యంగర్ తుకారం,పాగిడి చిరంజీవి,విజయ్ కుమార్ రాచర్ల సురేష్,పుట్ట కుమార్, కోమండ్ల శ్రీనివాస్,సిద్ధం మల్లేష్,ఏముర్ల ప్రదీప్,మామిడి విగ్నేష్ ఆవుల చందు దుర్గ చరణ్,తొగరి శ్రీనివాస్,కోట నవీన్,వుటూరి నరేష్ ఆనంద్ నరేష్,పల్లె రాజు సంతోష్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పిఎసిఎస్ చైర్మన్ బాదే చంద్రం..



**రామాయంపేట,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)** రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామంలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పిఎసిఎస్ చైర్మన్ బాదే చంద్రం టెంకాయ కొట్టి ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... యాసంగిలో వరి పంట పండించిన రైతులు వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ భాదే చంద్రం టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి సుప్రభాత రావు,ఎంపీటీసీ నాగులు మేఘమ్మగారి శంకరయ్య,గ్రామ సర్పంచ్ సిద్ధ రాములు,మాజీ సర్పంచ్ శామయ్య బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్ర దాడికి..ప్రతీకారం తీర్చుకోవాల్సిందే:






**ఉగ్రవాదుల దాడిని సమస్త సమాజం ఖండించాలి..**
**ఉగ్రవాదులను ఉరితీయాలి..**
**జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన తోకల శ్రీనివాస్ రెడ్డి**
**మృతులకు నివాళి,క్షతగాత్రులు కోలుకోవాలని ఆకాంక్ష..**

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 23**కాశ్మీర్‌లోని పహాల్గంలో కాల్పులు జరిపి భారతీయుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను బహిరంగంగా ఉరి తీయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి డిమాండు చేశారు. జమ్మూ కాశ్మీర్లో పర్యాటకులపై జరిపిన దాడిని ఖండిస్తూ కాల్పుల్లో మృతి చెందిన వారికి ఆరాంఘర్ చౌరస్తాలో నివాళులు అర్పించారు. అంతకుముందు ఆరాంఘర్ చౌరస్తాలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై క్రూరమైన దాడికి పాల్పడిన ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.పాకిస్థాన్ అసమర్థ నాయకత్వానికి ఈ ఘటన పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...దాడికి పాల్పడిన వారిని గుర్తించి ఉరిశిక్షి విధించాలని డిమాండ్ చేశారు.భారత్ ను దెబ్బతీయాలని పాక్ చూస్తే మూల్యం చెల్లించుకున్నట్లేనని హెచ్చరించారు. భారతదేశం నుంచి ఉగ్ర మూకలను తరిమి కొట్టాలన్నారు.ఈ దేశం గాలి పీలుస్తూ, ఈ దేశం తిండి తింటూ వెన్నుపోటు పొడిచిన వెన్నుపోటుదారులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఉగ్రదాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.పలు ప్రాంతాల నుంచి కాశ్మీర్ సందర్శనకు వచ్చిన వారిలో 28 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్య అన్నారు. ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్‌లో అలజడి సృష్టించేందుకు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వారిని పట్టుకునే వరకు ప్రధాని మోదీ, హెూం మంత్రి అమిత్ షా విశ్రమించరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ కొమురయ్య కోరని సదానంద్,భీమార్జున్ రెడ్డి, మహాలింగంగౌడ్,విజయ్ కుమార్,కాడేం సుధాకర్ జోగిరవి,రాచూరి రాజశేఖర్,సోల్కర్ రెడ్డి జగన్ డి.లక్ష్మీనారాయణ,సత్యనారాయణ బాబురావు అడికె జనార్ధన్ నర్సిరెడ్డి,బబ్లు,పాండు యాదవ్ శ్రీకాంత్ రెడ్డి,ఉత్తం,కిరణ్,శంకర్ రెడ్డి కిరణ్ చారి నాగేష్ యాదవ్,హరి కిషన్ జీ,రవి కాంత్ రెడ్డి, విటల్,బండారి బాలకృష్ణ,బిక్షపతి యాదవ్ సందీప్ ముదిరాజ్,వల్లూరి శ్రీనివాస్ కోరని క్రాంతి రాహుల్ రెడ్డి,రావుల భాస్కర్ మురళీధర్ రెడ్డి మధుసూదన్ రెడ్డి,నర్సిరెడ్డి,రాకేష్ గౌడ్ కొండల్ అంజి ఉమా ఎడ్లకాడి రవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు క్రేడా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


### హాజరుకానున కె.వి.ఆర్.




**కామారెడ్డి,ఏప్రిల్ 23(సూర్యరేఖ)**కామారెడ్డి జిల్లా క్రేడా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు జిల్లా అధ్యక్షులు నర్సాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంలోని రేణుకాదేవి కళ్యాణమండపంలో ఈ ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డితోపాటు రియల్ ఎస్టేట్ డెవలపర్స్ ఆత్మీయ సోదరులు హాజరవుతున్నారని నర్సాగౌడ్ తెలిపారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు


**రాజేంద్రనగర్ గ్రంథాలయంలో ఘనంగా ప్రపంచ పుస్తక పఠన దినోత్సవం..**
**రంగారెడ్డి జిల్లా గ్రంథాలయాల చైర్మన్ మధుసూదన్ రెడ్డి**



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)**పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయాల చైర్మన్ మధుసూదన్ రెడ్డి అన్నారు.బుధవారం రాజేంద్రనగర్ లోని గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.పుస్తక దినోత్సవన్ని పురస్కరించుకొని 90 నూతన పుస్తకాలు గ్రంథాలయానికి అందించారు. గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ...మంచి పుస్తకం చదవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని,ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు.నేడు యువత చేతిలో సెల్‌ఫోన్ చేరడం,దానిని దుర్వినియోగం చేసుకోవడం, ఫలితంగా జరుగుతున్న సంఘటనలు మనం నిత్యం చూస్తూనే ఉన్నామన్నారు.అందుబాటులోకి వచ్చిన ఓ సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం ఎలా ఉపయోగించుకుంటున్నామన్నది యువత ఆలోచించాలన్నారు.ఓ చిన్న పుస్తకం మన జీవితాన్ని మారుస్తున్నప్పుడు,దానికి మనం సమయం కేటాయించలేకపోవడం అంటే,లోపం ఎక్కడుంది? మనలోనే కదా! కాబట్టి యువత పుస్తకపఠనానికి ప్రాముఖ్యం ఇచ్చి,చెడు అలవాట్లను దూరం చేసుకోవాలి, “మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానం” కాబట్టి,అలాంటి పుస్తకాలను ఎంచుకొని ఆరోగ్యకరమైన సమాజానికి యువత నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాల ప్రధాన కార్యదర్శి రాణి,పచ్చ శ్రీనివాసులు,ఉమా రెడ్డి,రఘు ముదిరాజ్,ఝాన్సీ రెడ్డి,వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది,పాఠకులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,ఏప్రిల్23(సూర్యరేఖ) :** మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి రోడ్డుకు చెందిన పందిరి అశ్వీత(17).తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం..మృతురాలు లక్షెట్టిపేట పట్టణంలోని వాగేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది.ఈ నెల 22 న విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలో ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి మృతురాలి తండ్రి పందిరి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని లక్షెట్టిపేట ఎస్సై జి.సురేష్,సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేందర్ తెలిపారు.




## యువజ్యోతి ఫుట్బాల్ క్రీడాకారులకు షూస్ అందజేత..




**రామయంపేట,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)** రామాయంపేట పట్టణంలో యువజ్యోతి స్పోర్ట్స్ అకాడమీ శిబిరమును కో-ఆర్డినేటర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు క్రీడలలో క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంపొందించడానికి క్రీడా శిబిరాన్ని ఏర్పాటు చేశారు.వేసవికాలంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు షూస్ ఇవ్వాలని కోరగా లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ క్రీడాకారులు మంచి ప్రావీణ్యం పొందుట కొరకు వారి కోరికను మన్నించి బుధవారం రోజు ఎస్సై బాలరాజ్ చేతుల మీదుగా షూస్ పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ...ప్రావీణ్యం కలిగిన క్రీడాకారులు తగిన వసతులు లేక వెనకడుగు వేస్తున్నారని,అలాంటి వారికి మీ ప్రోత్సాహం ఎంతగానో ఉపయోగపడుతుందని మోహన్ నాయక్ సేవలు మరవలేనివని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాత్రికేయులు మల్లేశంబిజెపి పట్టణ సీనియర్ నాయకులు శంకర్ గౌడ్,లీలా గ్రూప్ సభ్యులు సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద వధువుకు పుస్తె మట్టెలు అందజేసిన డా.మోహన్ నాయక్..



**రామాయంపేట,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)**రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన సంతోష,నర్సింలు దంపతుల కూమార్తె నిరుపేద వధువు సౌమ్య వివాహానికి లీలా గ్రూప్ సభ్యులు,లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ వారి వివాహానికి హాజరై పూస్తే మట్టెలను అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ..ఈ కాలంలో పెండ్లిలు చేయాలంటే పేదరికంలో ఉన్నవారికి చాలా కష్టం అవుతుందన్నారు.వారి ఆర్థిక పరిస్థితులలో మీ వంతు సహాయంగా బంగారం లాంటి మనసుతో కలిగిన మీరు బంగారం బహుకరించడం చాలా గొప్ప విషయమని,ఆ దేవుడి ఆశీస్సులు మీకు ఎల్లప్పుడూ ఉండాలని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యువకులు మహిళలు,లీల గ్రూప్ సభ్యుడు సురేష్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ..




**రామయంపేట,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల ఫలితాలను ప్రకటించింది.అందులో భాగంగా రామాయంపేట మున్సి పాలిటీ పరిధిలోని కోమటిపల్లి తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న షర్మిలారెడ్డి ఎంపీసీ 463 / 470 మార్కులు సాధించిందని,అలాగే ద్వితీయ సంవత్సరం చదువుతున్న బండారి నాగశ్రీ ఎంపీసీ 927 / 100 మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనపరచినందుకు గాను కళాశాల తరపున విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు తెలంగాణ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.

# నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగించుకోవాలి






## ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**శంషాబాద్,ఏప్రిల్23(సూర్యరేఖ)** నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాతంరాయి లోని రాజమహల్ ఫంక్షన్ హాల్లో కందకట్ల సిద్దులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కు ముఖ్య అతిధిగా ఎమ్మె ల్యే టి.ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే నియామక పత్రాలు ఇచ్చారు.అనంతరం జాబ్ మేళా యాప్ ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నిరుద్యోగు లకు ఉద్యోగ అవకాశాలు అందించే ఇలాంటి జాబ్ మేళా నిర్వాహకులను సిద్దులురెడ్డిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. నిరుద్యోగులు ఈ సదావకాశాన్ని వినియోగించిన తమ ప్రతిభను కనబరిచి ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అమాయక ప్రజలపై ఉగ్రవాదుల దాడి బాధాకరం





**పర్యాటకులను కాల్చి చంపిన వారిని కఠినంగా శిక్షించాలి..**
**పహల్గాం ఉగ్రదానికి నిరసనగా శాంతి ర్యాలీ..**
**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 23** జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడి అమానుషమని, పర్యాటకులను కాల్చి చంపిన వారిని కఠినంగా శిక్షించాలని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.పహల్గామ్ దాడిని ఖండిస్తూ మృతులకు సంతాపం తెలిపేందుకు మైలార్ దేవ్ పల్లి చౌరస్తాలో క్యాండిల్ తో శాంతి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి అమానుషమని, పర్యాటకులను కాల్చి చంపిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.అమాయకమైన ప్రజలను ఉగ్రవాదులు దాడి చేసి చంపడం బాధాకరమన్నారు.భారతదేశ ప్రతిష్టను దిగజార్చడానికి ఉగ్రవాదులు హేయమైన చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.ఇలాంటి సంఘటనలను పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరు ఖండించాలని కోరారు.దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికులకు అండగా నిలవాలని కోరారు.పహల్గం ఘటనలో పర్యాటకులు మరణించడం బాధాకరమన్నారు. ఉగ్రవాదులు మతం అడిగి అమాయక ప్రజలను అత్యంత కిరాతకంగా హతమార్చారని అన్నారు. పహల్గం ఘటన పిరికిపంద చర్య అని అన్నారు. పహల్గాం ఘటనలో 28 మందిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను బహిరంగంగా ఉరితియాలన్నారు.సైనిక దుస్తుల్లో వచ్చి అమాయక పర్యాటకులను లక్ష్యంగా చేసుకోవడం హేయమైన చర్య అన్నారు. ఉగ్రదాడిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని బాధిత కుటుంబాలకు సాధ్యమైనంత త్వరగా న్యాయం జరిగేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సరికొండ వెంకటేష్, ధనుంజయ కాశిగారి యాదగిరి,అడికె అర్జున్, మసున వెంకటేష్ డి.వి.కుమార్ బాసశ్రీనివాస్ గట్టయ్య ఎల్లప్ప వజ్రమ్మ, ఓంప్రకాష్ లక్ష్మారెడ్డి ఖాళీల్ రాము రాజు ముదిరాజ్, పాల్గొన్నారు.



## పహాల్గం ఉగ్రదాడిలో మరణించిన పౌరులకు నివాళులర్పించిన బీజేపీ బెల్లంపల్లి టౌన్




**బెల్లంపల్లి,ఏప్రిల్23(సూర్య రేఖ)** ఉగ్రదాడిలో మరణించిన,వారి ఆత్మకు శాంతి కలగాలని గాయపడిన పౌరులకు తగు న్యాయం చేయాలని పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాశ్మీర్ లోని పహల్గంలో నిన్న మారు పోలీసు వేషంలో వచ్చి విచక్షణరహితంగా పర్యాటకులపై బుల్లెట్లతో దాడులు చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలని,భారత పౌరులపై జరిగిన ఉగ్రదాడికి నైతిక బాధ్యత వహిస్తూన్న ఉగ్రవాదులను వారికి సహకరిస్తున్న కొన్ని సంస్థలపై తగు చర్యలు తీసుకోవాలని,గాయపడిన పౌరులను మరణించిన కుటుంబాలను ఆదుకోవాలని ప్రతి ఒక్కరికి తగు న్యాయం అందేలా చూడాల్సిందిగా,కాశ్మీర్లో పర్యటకులను కిరాతకంగా చంపిన జిహాదీ పాక్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను గుర్తించి అంతం చేయాలని ఉగ్ర దాడికి కారణమైన పాక్ ప్రభుత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా ఒంటరి చేయాలని,వాణిజ్య,వ్యాపార,పర్యాటక రంగాలపై ఆంక్షలు విధించాలని ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్లో అలజడి సృష్టించడమే పాక్ ప్రధాన ఉద్దేశమని ఉగ్రవాదాన్ని దేశవ్యాప్తంగా ఉన్న పౌరులంతా ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోయల్కర్ గోవర్ధన్,అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్,జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గోమాస కమల,తాండూర్ మండల్ ఇన్చార్జ్ మద్దర్ల శ్రీనివాస్,ఎస్సీ మోర్చా కార్యదర్శి కోడి సురేష్,సీనియర్ నాయకులు స్వామి,జిదుల రాములు,వేల్పుల రాజయ్య,పట్టణ ఉపాధ్యక్షులు ఉప్పులేటి స్రవంతి,అరవింద్,ఎర్రోజు శ్రీనివాస్,పుల్లె ప్రశాంత్,చింతకింది లావణ్య,గౌస్ బాబా,పుల్లూరి రాము,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జమ్ము కాశ్మీర్ అమర వీరులకు నివాళులు..



**నిజాంపేట,ఏప్రిల్23(సూర్యరేఖ)**మండల కేంద్రంలో బుధవారం గ్రామ యువకుల ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం వద్ద ఉగ్రవాదుల దాడిలో మరణించిన అమరవీరులకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉగ్రవాదుల చర్య పిరికిపంద చర్య అని అన్నారు.భారత ప్రభుత్వం తప్పకుండా ఉగ్రవాదులపై ప్రతిదాడి చేసి తగిన బుద్ధి చెబుతుందని అన్నారు.హిందువులను టార్గెట్ చేసి దాడి చేయడాన్ని హిందూ సమాజం ముక్తకంఠంతో ఖండిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు సిద్ధరామిరెడ్డి జిపి స్వామి,తమ్మలి రమేష్,చల్మేటి నాగరాజు నరేందర్,మాజీ ఎంపిటిసి పున్న వెంకటస్వామి బండారి ప్రశాంత్ ప్రశాంత్ గౌడ్ నాయిని లక్ష్మణ్,తిరుపతి,వినయ్ గౌడ్ సామల మహేష్ మోహన్ రెడ్డి,గెరి గంటి బాబు,రంజిత్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ మోటార్ల కెపాసిటీ పెంపు హర్షనీయం బెజ్జంకి సుదర్శన్.



**కామారెడ్డి,ఏప్రిల్ 23( సూర్యరేఖ)**కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా విశ్వకర్మలు చేస్తున్న పనులకు సంబంధించి విద్యుత్ మోటార్ల కెపాసిటీని పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి సుదర్శన్ అన్నారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బుధవారం కాళికాదేవి ఆలయంలో మీడియాతో మాట్లాడుతూ...భారత రాష్ట్ర సమితి పాలనలో లోడు కెపాసిటీని పెంచాలని ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసిన పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం మా గోడును విని ఈ నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు పున్నమచారి పోరాటాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సమావేశంలో సుదర్శన్ హనుమాన్లు లక్ష్మీనా రాయణరాజు శ్రీనివాస్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఇది క్షమించరాని నీచమైన చర్య..

**ఉగ్రవాదాన్ని తిప్పి కొడదాం..**
**ఉగ్రవాదులు జరిపిన కాల్పులు బాధకరం..**
**మైలార్ దేవ్ పల్లి డివిజన్ ప్రెసిడెంట్,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ**



**రాజేంద్రనగర్,ఏప్రిల్23(సూర్యరేఖ)** ఉగ్రవాదులు జరిపిన కాల్పులు దారుణమని మైలార్ దేవ్ పల్లి డివిజన్ ప్రెసిడెంట్,మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్ కురుమ అన్నారు.కాల్పులకు నిరసనగా బాబుల్ రెడ్డినగర్ వీధిలో కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీని నిర్వహించారు.అనంతరం ఎస్. వెంకటేష్ కురుమ మాట్లాడుతూ...ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.ఇలాంటి సంఘటనలను పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరు ఖండించాలని కోరారు.దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికులకు అండగా నిలవాలని కోరారు.పహాల్గం ఘటనలో పర్యాటకులు మరణించడం బాధాకరమన్నారు.ఉగ్రదాడిని తీవ్రస్థాయిలో నియంత్రించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.భారతదేశంపై దాడులు చేయాలని చూస్తే దేశ పౌరులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ దేశంలో అశాంతిని రేపే విధంగా కుట్రలు చేస్తున్న ఉగ్రవాదులను తుదముట్టించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ ర్యాలీలో వెంకటరమణ గుప్తా,ఉప్పల్ శీను,సందీప్,మల్లేష్, కాళిదాస్ సునీల్ కిషోర్ రాయుడు జగన్ సురేష్,దినేష్,గోపాల్ నాయక్ కిరణ్ రవి,తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్యల పరిష్కారానికి చొరవ





**బీఆర్ఎస్ నాయకులు భానుచందర్**

**మణికొండ,ఏప్రిల్23(సూర్యరేఖ)**మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ యువ నాయకుడు భానుచందర్ అన్నారు.బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గత మార్చి నెల 21 న జలమండలి అధికారులను కలసి మణికొండ క్వార్టర్స్ లో ఎన్నో ఏళ్ల క్రితం వేసిన 4 ఇంచిల పైపు లైన్ ద్వారా త్రాగు నీటి సరఫరా అవుతుందని జనాభా పెరుగుదలకు అనుగుణంగా మంచినీరు అందించాలని అందించాలని కోరారు. కనుక 4 ఇంచిల లైన్ మార్చి కనీసం 6 ఇంచిల లైన్ వేయాలని విన్నవించారు.ఏప్రిల్ 16 న మళ్లీ ఒకసారి స్థానిక నాయకులు జి.శ్రీనివాస్ రాజు దుర్గేశ్,శ్రీనివాస్ చారి,రాయప్ప చిన్నలతో పాటు ఇతర బిఆర్ఎస్ పార్టీ నాయకులు అందరూ మేనేజర్ రామకృష్ణను కలసి వినతి పత్రం సమర్పించారు.పర్యవసానంగా ఆ అధికారి మంగళవారం స్వయంగా విచ్చేసి పరిస్థితులు అవగాహన చేసుకుని 6 ఇంచిల నీటి పైప్ లైన్ వేయడానికి అనుకూలంగా అంచనాలనుపై అధికారులకు తెలియ పరుస్తానని తెలిపినట్లు వివరించారు.ఆ సమయంలో భాను చందర్ తో పాటు మోహన కృష్ణ రాజు దుర్గేశ్ శ్రీనివాస్ రవి,రామ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

### భారత రాష్ట్ర సమితి మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ




**మణికొండ,ఏప్రిల్23(సూర్యరేఖ)** మణికొండ మున్సిపాలిటీలో ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పని చేస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు.బీఆర్ఎస్ పార్టీ గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట శ్రీరామ్ నగర్ సెక్రటేరియట్ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పందెంవాగు నాలా చెత్తాచెదారం మూలానా మురికి నీటి పారుదల సక్రమంగా లేకపోవడంతో, పరిశుభ్రత పూర్తిగా కరువై నీరు నిలువ ఉండడం వలన భరించలేని కంపు వాసనతో పాటు దోమల బెడదతో బాధపడు తున్నారని తెలిపారు.పందన్ వాగు పక్కనే పార్కుకు నిర్దేశించిన ప్రాంతమంతా చెత్తా చెదారంతో నిండిపోయింది.ఒక ప్రక్క ప్రభుత్వ స్థలాలు లేవని చెబుతూనే ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారు.పందెం వాగు పరివాహక ప్రాంతమంతా అన్యాక్రాంతమవుతున్నది.కావున మున్సిపల్,రెవెన్యూ అధికారులు సత్వరమే స్పందించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలి.వీధి శునకాలు ఎక్కువగా ఉన్న కారణంగా వీటికి వ్యాక్సినేషన్,పునరుత్పత్తి జరగకుండా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కొత్తగా రోడ్డు వేసిన ప్రాంతంలో కనీస సాంకేతిక పద్ధతులు అవలంభించని కారణంగా డ్రైనేజ్ మ్యాన్ హెూల్స్ గుంతలుగా ఏర్పడడం జరిగింది.వీధి దీపాలు తరచూ పాడై పోతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు.ఇంటి పన్నును ముక్కు పిండి జిహెచ్ఎంసి కన్నా మూడింతలు ఎక్కువ వసూలు చేస్తూ ప్రజా సౌకర్యాలకు వచ్చేటప్పటికీ జవాబుదారితనం కొరవడిందని పలువురు తెలియజేశారు.అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అందె లక్ష్మణ్ రావు,బుద్ధోలు బాబు,మల్యాద్రి నాయుడు,ఉపేంద్రనాథ్ రెడ్డి,బిట్లుగా రాజు,శ్రీనివాస్ చారి,సంఘం శ్రీకాంత్,కిరణ్ యాలాల,జై రామ్,సుమనళిని,రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి ఐడీవోసీలో ఘనంగా పోషణ పక్షం కార్యక్రమం





**జయశంకర్ భూపాలపల్లి :** పోషణ పక్షం 8 ఏప్రిల్ 2025 నుండి 23 ఏప్రిల్ 2025 వరకు అవగాహన సదస్సులు, ఆరోగ్య సదస్సులు, పోషకాహార ప్రదర్శనలు, వైద్య శిబిరాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఏప్రిల్ 23 చివరి రోజున పోషణ పక్షం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హాజరై పోషణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.... భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు పోషణ పథకాలు కీలకం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన పోషకాహారం అందిం చేందుకు అందరూ బాధ్యత వహించాలి. ప్రతి తల్లి తన శిశువును ఆరోగ్యవంతంగా పెంచేందుకు పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి అన్నారు. అదనపు కలెక్టర్ శ్రీమతి విజయ లక్ష్మి మాట్లాడుతూ పోషణ పక్షం సందర్భంగా గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు, పోషకాహార సదస్సులు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకున్నాం. ఈ కార్యక్రమాల ద్వారా సమాజంలో పోషకాహార అవగాహన పెరుగుతుంది. పోషణ అభియాన్ ను విజయవంతం చేయడంలో ఆంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల పాత్ర అమూల్యం" అని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ అధికారి మల్లేశ్వరి మాట్లాడుతూ.... పిల్లల్లో పోషకాహార లోపాలను నిర్ధారించేందుకు బరువు, ఎత్తు కొలతలు, హేమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాం. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేకంగా పోషకాహార కిట్లు, అవగాహన పుస్తకాలు అందించామని ప్రత్యేకంగా 1000 రోజుల ప్రణాళికలు ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది అని వివరించారు సిడిపివో రాధిక మాట్లాడుతూ ఆంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో 15 రోజులపాటు పోషణ కార్యకలాపాలు, తల్లులకు పోషకాహార శిక్షణ, పోషణ పై నాటకాలు, పోటీలు నిర్వహిస్తాం. గ్రామస్థాయిలో ప్రతి కుటుంబాన్ని చేరి పోషకాహారాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక టీమ్స్ పనిచేస్తున్నాయి" అని తెలిపారు. తదుపరి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సీమంతాలు, అక్షరాబ్యాసం, అన్న ప్రాసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది, కార్యక్రమంలో భాగంగా పోషకాహార ప్రదర్శన లు చేశారు వివిధ ధాన్యాలు, పప్పుదినుసులు, పండ్లు, కూరగాయలు, తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే పోషకాహార వంటకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐ సీ డీ ఎస్ సూపర్వైజర్లు, సంక్షేమ శాఖ సిబ్బంది, ఆంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు

## 48 గంటల్లో రైతు ఖాతాల్లోకి డబ్బులు

**నిజామాబాద్ :** రబీ పంటల దిగుబడి రైతులకు ఆనందాన్ని నింపింది. ఈ సంతోష సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా ధాన్యం నిల్వ కోసం అవసరమైన గన్నీ సంచులను పుష్కలంగా అందుబాటులో ఉంచామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అంతేకాకుండా.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన కేవలం 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన రైతు మహోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల శ్రమను గౌరవిస్తూ చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం నీటిపారుదల రంగంపై భారీగా నిధులు వెచ్చించినా ఆశించిన ఫలితాలు సాధించలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రైతుల కోసం ధాన్యం కొనుగోళ్లు దేశంలో ఎక్కడా లేని విధంగా సకాలంలో జరుగుతున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు అన్నారు.నిజామాబాద్లో మూడు రోజుల పాటు జరగనున్న రైతు మహోత్సవాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని ఆయన సంతోషంగా ప్రకటించారు.

## కరెంట్ షాక్ తో గేదె మృతి...



**శివంపేట,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)**శివంపేట మండలంలోని ఎదుల్లాపూర్ శివారులో రైతు ముద్దుగల లక్ష్మయ్య గేదె కరెంట్ షాక్ గురై మృతి చెందడం జరిగింది.గేదె ఖరీదు 80 వేల వరకు ఉంటుందని,పాడి గేదె వలన తన ఉపాధి కొనసాగుతుందని,ప్రభుత్వం నష్టపరిహారం అందించి తనను ఆదుకోవాలని కోరాడు.

## జమ్ము కాశ్మీర్ ఘటనలో మృతి చెందిన వారికి నివాళి..



**శివంపేట,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)** శివంపేట్ మండలంలోని గూడూరు గ్రామంలో బీజేవైఎం మండలం అధ్యక్షులు బల్కంపేట్ భాస్కర్ మాటల్లాడుతూ.. జమ్మూకాశ్మీర్ పెహల్గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి ఘటన హిందూ సమాజాన్ని కలచివేసింది.మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ ఉగ్రదాడిలో గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థించడం జరుగుతుందని వివరించారు.ఈ ఘాతుకానికి ఒడిగట్టిన వారికి బీజేపీ ప్రభుత్వం గట్టి గుణపాఠం చెప్పి తీరుతుంది.బాధితులకు అండగా నిలుస్తుంది ఈ కార్యక్రమంలో గూడూరు తాజా మాజీ ఉప సర్పంచ్ చరణ్,కొత్తపేట రాజు,కుమ్మరి ప్రవీణ్, కుమ్మరి ప్రభుదాస్,గూడెపు రాజు,గూడెపు నవీన్, గొల్ల హనుమంతు అఖిలేష్,గూడెపు రాజు,కాదర్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న 9 మందిని పట్టుకున్న లక్షెట్టిపేట పోలీసులు..



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,ఏప్రిల్ 23 (సూర్యరేఖ)** ఉత్కూర్ చౌరస్తా సమీపంలోని నిర్మాణ నిర్మాణాత్మక ప్రదేశంలో బుధవారం పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు.పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకుని వారి వద్ద నుండి రూ.3470 నగదు,ఐదు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన నిందితుల్లో తుమ్మల సునీల్ ఊట్కూర్ గ్రామం,షేక్ సమీర్ సత్య సాయి నగర్,లక్షిటీపేట్, ఏనుగుల తిరుపతి,గౌరవంతుల ప్రశాంత్,కడమండ్ల శేఖర్,భూక్య రాజు రాచర్ల రాకేష్, ముప్పు శ్రీధర్,పేరం పోశంలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సిఐ అల్లం నరేందర్,ఎస్ఐ సురేష్,లు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా కాల్పులకు దిగడం దుర్మార్గం

**పెద్దపల్లి :** శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టులపై కాల్పులకు దిగడం దుర్మార్గ చర్య అని పలువురు ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో పలు ప్రజాసంఘాలు, పౌర హక్కుల నాయకులు మాట్లాడారు. శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని, కాల్పుల విరమణ, ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర గడ్చిరోలి, తెలంగాణ, ఒడిస్సా రాష్ట్ర అటవీ ప్రాంతాల్లో చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని గత కొన్ని రోజులుగా దేశంలోని మేధావులు, హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, జర్నలిస్టులు, రచయితలు, ఎడిటర్లు, రాజ్యాంగాన్ని ఐదవ షెడ్యూల్, ఆరవ షెడ్యూల్ పెసా చట్టాలను కాపాడుకోవాలని ఆదివాసి హననాన్ని ఆపి వేయాలని, మావోయిస్టు ఉద్యమకారులను హతమార్చ డాన్ని నిలిపివేయాలని విజ్ఞప్తి చేస్తున్నారని అన్నారు.

## బిజినెస్

# అమెజాన్, వాల్‌మార్ట్‌లపై నిబంధనలకు పాతరేయాలి

భారత రిటైల్ రంగం, చిరు వ్యాపారాలు తీవ్ర ప్రమాదంలో పడేలా అమెరికా ఒత్తిడి ప్రారంభమైంది. తమ దేశానికి చెందిన అమెజాన్, వాల్‌మార్ట్ లాంటి ఇ-కామర్స్ సంస్థలపై ఇండియా విధిస్తోన్న ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని పట్టుపడుతోందని డొనాల్డ్ ట్రంప్, పరిశ్రమ ఎగ్జిక్యూటివ్స్, లాబీయిస్టులు, యుఎస్ ప్రభుత్వ అధికారుల్ని ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ మంగళవారం ఓ కథనం ప్రచురించింది. భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై ఇటీవల 26 శాతం టారిఫ్‌ను విధించిన విషయం తెలిసిందే. దీన్ని తాత్కాలికంగా వాయిదా వేసినప్పటికీ.. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా యుఎస్ ఇ కామర్స్ సంస్థలపై అమలు చేస్తోన్న పలు నిబంధనలను తొలగించాలని చర్చల్లో అమెరికా ఒత్తిడి చేసిందని తెలుస్తోంది.భారత్‌కు చెందిన ఇ-కామర్స్ రంగంలోని సంస్థలకు ఇస్తున్న స్థాయిలోనే మిగితా అన్ని సంస్థలకు సమాన అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. గతేడాది వాల్‌మార్ట్ అధినేత మెక్‌మిలన్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశమై భారత్‌లో ఈ కామర్స్ కంపెనీలపై ప్రభుత్వం విధించిన నిబంధనలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భారత్‌లో అన్ని సంస్థలకు ఒకే విధానాన్ని అమలు చేసేలా చూడాలని కోరారు. భారత్‌లో ఇ-కామర్స్ మార్కెట్ విలువ 125 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.10 లక్షల కోట్లు)గా ఉంది. ఇందులో అమెజాన్, వాల్‌మార్ట్‌కు చెందిన ఫ్లిప్‌కార్ట్ కీలక వాటాను కలిగి ఉన్నాయి. అమెజాన్‌కు 4 కోట్లు, ఫ్లిప్‌కార్ట్‌కు 5 కోట్ల చొప్పున డైలీ యాక్టివ్ వినియోగదారులున్నారు. అమెజాన్ 32 శాతం, ఫ్లిప్‌కార్ట్ 38 శాతం చొప్పున మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి. భారత్‌లో విదేశీ ఇ-కామర్స్ సంస్థలు ఇతరులు తయారు చేసిన వస్తువులను మాత్రమే విక్రయించాలని ప్రధాన నిబంధన ఉంది. విదేశీ యాజమాన్యంలోని ఆన్‌లైన్ కంపెనీలు ఇన్వెంటరీ కలిగి ఉండటంతో పాటు, వినియోగదారులకు నేరుగా అమ్మడంపై నిషేధాలు ఉన్నాయి. కాగా.. దేశీయ కంపెనీలు సొంతంగా తయారు చేసుకున్న ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వీలుంది. దీన్ని ప్రధానంగా అమెరికా తప్పు పడుతోంది. దీనిని టారీఫేతర అడ్డంకిగా అమెరికా ఆరోపిస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పరిమితిని కూడా ఇలానే పొలుస్తోంది. ఈ నేపథ్యంలో భారత్‌తో చర్చల సమయంలో తమ దేశ ఇ-కామర్స్ దిగ్గజాల అభిప్రాయాలు, డిమాండ్‌లను అమెరికా చాలా జాగ్రత్తగా భారత్‌లో అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఓ అధికారి పేర్కొన్నట్లు ఫైనాన్సియల్ టైమ్స్ వెల్లడించింది. ఈ క్రమంలోనే భారత ఇ-కామర్స్ మార్కెట్‌ను తమ సంస్థలకు అనుకూలంగా మరింతగా తెరవాలని భారత్‌పై ఒత్తిడి తీసుకొస్తోందని తెలుస్తోంది.










### ఎయిర్‌టెల్ చేతికి అదానీ స్పెక్ట్రం




అదానీ గ్రూపునకు చెందిన స్పెక్ట్రంను భారతీ ఎయిర్‌టెల్ సంస్థ స్వాధీనం చేసుకుంది. భారతీ ఎయిర్‌టెల్ తన అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్‌తో కలిసి అదానీ డేటా నెట్‌వర్క్స్‌కు చెందిన 26గిగాహెడ్జ్ బ్యాండ్‌లోని 400 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను వినియోగించుకునేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా ఎయిర్‌టెల్ తన 5జి సామర్థ్యాలను, నెట్‌వర్క్ కెపాసిటీని పెంచుకోనుంది. నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుందని ఆ సంస్థ పేర్కొంది. 2022లో జరిగిన స్పెక్ట్రం వేలంలో అదానీ డేటా నెట్‌వర్క్స్ రూ.212 కోట్లతో 400 మెగాహెడ్జ్ స్పెక్ట్రంను దక్కించుకుంది. గుజరాత్, ముంబయి, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, కర్నాటక, తమిళనాడులోని ఈ స్పెక్ట్రంను ఇక ఎయిర్‌టెల్ ఉపయోగించుకోనుంది. కాగా ఎంత మొత్తానికి ఈ స్పెక్ట్రం క్రయ, విక్రయం జరిగిందనే విషయాన్ని ఇరు సంస్థలు వెల్లడించకపోవడం గమనార్హం.

### ఫ్రీ ఏసీల స్కీమ్‌పై కేంద్రం స్పష్టత



ప్రజలకు ఉచిత ఎయిర్ కండిషనర్లు (ఏసీలు)ను అందిస్తామని హామీ ఇస్తూ ప్రభుత్వం 'పీఎం మోదీ ఏసీ యోజన 2025' అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందని సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ అవుతోంది. ఈ పథకం కోసం నమోదు చేసుకునే అవకాశాన్ని ఇచ్చారని, నమోదు చేసుకున్న వ్యక్తులు 30 రోజుల్లోపు 5 స్టార్ ఏసీ డెలివరీ పొందవచ్చని ఆ వార్తలో ఉంది. ఈ పథకం కోసం 1.5 కోట్ల ఏసీలు సిద్ధం చేశారని, ఈ నేపథ్యంలో భారతదేశంలో భారీగా ఏసీల కొరత ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు యూపీఎస్సీ మేటర్స్ అనే ఇన్‌స్టా పేజీలో ఈ పోస్ట్ చేసింది. 18 ఏళ్లు పైబడిన వారు ఉచితంగా 5-స్టార్ ఏసీను పొందేందుకు అర్హులని ఆ పోస్ట్‌లో ఉంది. ముఖ్యంగా ఏసీలు లేనివారికి 50 శాతంతగ్గింపు పొందవచ్చని పేర్కొంది. అయితే ఆ పోస్ట్‌లోని లింక్ క్లిక్ చేస్తే వినియోగదారులు రిజిస్ట్రేషన్ కోసం బీఎస్ఈఎస్ యమునా పవర్ లిమిటెడ్ వెబ్‌సైట్‌కు వెళ్తుంది.అయితే ఈ వైరల్ పోస్ట్‌ను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. పీఐబీ అధికారిక హ్యాండిల్ ఈ మేరకు ఓ పోస్ట్ చేసింది. సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్న ఒక పోస్ట్ 'పీఎం మోదీ ఏసీ యోజన 2025' అనే కొత్త పథకం కింద ప్రభుత్వం ఉచితంగా 5-స్టార్ ఎయిర్ కండిషనర్లను అందిస్తుందని, అలాగే 1.5 కోట్ల ఏసీలు ఇప్పటికే సిద్ధం చేశారనే వార్త ఫేక్ అని స్పష్టం చేసింది.పీఐబీ ఫ్యాక్ట్ చెక్ డేటా ప్రకారం ఈ తరహా పథకమే లేదని పేర్కొంది. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నేతృత్వంలోని విద్యుత్ మంత్రిత్వ శాఖ అలాంటి పథకాన్ని ప్రకటించలేదని పేర్కొన్నారు.

# అమెరికా భజనలోనే పరితపిస్తున్న మోడీ పరివారం



అమెరికాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా ఆయన మొహం మీదనే టారిఫ్‌లు తగ్గించే ప్రసక్తే లేదంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ తెగేసి చెప్పినా..మోడీలో ఇసుమంతైనా చలనం రాలేదు. అమెరికా చెప్పిన ప్రతిదానికీ ఊకొట్టడమే కాకుండా సుంకాలు ఆయా దేశాల విధానపర నిర్ణయాలంటూ అమెరికాను సమర్థించేందుకు కూడా బిజెపి నేతలు సిగ్గుపడింది లేదు. ఈ క్రమంలోనే అమెరికా ఉపాధ్యక్షులు వాన్స్‌తో పాటు ట్రంప్ మిత్రుడు, టెస్లా అధినేత ఎలన్ మస్క్‌ను భారత్‌కు ఆహ్వానించి మోడీ సర్కార్ అమెరికా భజనలో పరితపిస్తోంది. సింగపూర్ లాంటి చిన్నచిన్న దేశాల అధినేతల సైతం ట్రంప్ తీరును, అమెరికా నైజాన్ని కడిగిపారేస్తుండగా మోడీ సర్కార్ మాత్రం 'పెద్దన్న' పట్ల వినయవిధేయతలనే చాటుకోవడం సిగ్గుచేటు అని విమర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ఆ దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగం నుంచి మోడీ సర్కార్ ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని నెటిజన్లు హితవు పలుకుతున్నారు. అమెరికా తీరును ఎండగట్టిన లారెన్స్ ప్రసంగం ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. అందులో ఆయన ఏమన్నారంటే.. సుంకాలపై ట్రంప్ నిర్ణయాల ను ఆయన భూకంపంగా అభివర్ణించారు. సింగపూర్ వంటి చిన్న దేశాలను అణచివేసే నిర్ణయాలుగా వాటిని పేర్కొన్నారు. ఇక స్వేచ్ఛా వాణిజ్య యుగం ముగిసినట్లేనని పేర్కొన్నారు. " ట్రంప్ విధానం మరింత ఏకపక్ష, రక్షణాత్మక, ప్రమాదకరమైంది. మనం ఒక కొత్త దశలోకి ప్రవేశిస్తున్నాము. ఇంతకాలం సింగపూర్ 10 బేస్ టారిఫ్ శ్రేణీలో ఉంది. దేశం వారీగా వారి స్వంత ఇష్టపడే నిబంధనలపై మాత్రమే వ్యాపారం చేయడం ద్వారా అన్ని దేశాలకు, ముఖ్యంగా సింగపూర్ వంటి చిన్న దేశాలకు ఇబ్బందిని కలిగిస్తుంది. ఇది పూర్తి స్థాయి ప్రపంచ వాణిజ్య యుద్ధానికి దారి తీస్తుంది. ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు.. కానీ ప్రమాదాల గురించి మనం స్పష్టంగా ఉండాలి. సింగపూర్ ప్రతీకార సుంకాలకు దూరంగా ఉంటుంది. కానీ ఇతర దేశాలు అదే సంయమనాన్ని చూపించకపోవచ్చు. మనకు ఒకప్పుడు తెలిసిన ప్రపంచ ప్రశాంతత. స్థిరత్వం తిరిగి రాదు." అని వాంగ్ పేర్కొన్నారు.

## స్పోర్ట్స్

# టీ20ల్లోనే చెత్త రికార్డ్




పాకిస్తాన్ సూపర్ లీగ్ 10వ సీజన్‌లో లాహోర్ ఖలందర్స్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రవూఫ్ ఓ చెత్త రికార్డును సృష్టించాడు. దీనిని జీవితంలో గుర్తుంచుకోవడానికి కూడా ఇష్టపడరు. పీఎల్ఎల్ 2025లో భాగంగా 12వ మ్యాచ్ ముల్తాన్ సుల్తాన్స్ వర్సెస్ లాహోర్ ఖలందర్స్ మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముల్తాన్ సుల్తాన్స్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లకు 228 పరుగులు చేసింది. ముల్తాన్ జట్టుకు చెందిన యాసిర్ ఖాన్ 44 బంతుల్లో 87 పరుగులతో సత్తా చాటాడు. ఇది కాకుండా, కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ 17 బంతుల్లో 32 పరుగులు, ఉస్మాన్ ఖాన్ 24 బంతుల్లో 39 పరుగులు సాధించారు. చివరి ఓవర్లలో ఇఫ్తికార్ అహ్మద్ కేవలం 17 బంతుల్లో మూడు సిక్సర్లు, మూడు ఫోర్లతో 40 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 228 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో లాహోర్ ఖలందర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 195 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే లాహోర్ ఖలందర్స్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రౌఫ్‌ను చిత్తుగా కొట్టేయడం. తన 3 ఓవర్లలో భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. అది ఒక రికార్డుగా మారింది. లాహోర్ ఖలందర్స్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రవూఫ్ తన మూడు ఓవర్లలో 18.00 సగటుతో 54 పరుగులు ఇచ్చాడు. ఇది అతని టీ20 కెరీర్‌లో అత్యధిక ఎకానమీ రేటు. ఇందులో ఫోర్లు, సిక్సర్ల నుంచి 46 పరుగులు ఇచ్చాడు. ఈ సీజన్‌లో అతని ప్రదర్శన గురించి చెప్పాలంటే, అతను 4 మ్యాచ్‌లలో 4 ఇన్నింగ్స్‌లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. ఈ కాలంలో, అతను 146 పరుగులు సమర్పించుకున్నాడు. పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో ఇప్పటివరకు 61 మ్యాచ్‌లు ఆడి, 69 వికెట్లు పడగొట్టాడు హారిస్ రవూఫ్. హారిస్ రవూఫ్ తన వేగంతో ప్రత్యర్థులకు షాకిస్తుంటాడు. ఈ సీజన్‌లో ముల్తాన్ సుల్తాన్స్ తొలి విజయాన్ని సాధించింది. ఆ జట్టు లాహోర్ ఖలందర్స్‌ను 33 పరుగుల తేడాతో ఓడించింది. 228 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి దిగిన లాహోర్ ఖలందర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 195 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీనికి ముందు, ముల్తాన్ సుల్తాన్స్ జట్టు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ విజయం కొంత ఊరటనిచ్చింది. కాగా, లాహోర్ ఖలందర్స్ 4 మ్యాచ్‌ల్లో రెండింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. పాయింట్ల పట్టిక విషయానికొస్తే, లాహోర్ ఖలందర్స్ 4 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో మూడవ స్థానంలో ఉంది. కాగా, ముల్తాన్ సుల్తాన్స్ 4 మ్యాచ్‌ల్లో మూడు ఓటములు, ఒక విజయంతో పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది.

### రూటు మార్చిన టీమిండియా మాజీ కెప్టెన్



భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ 2021లో తొలిసారిగా ఐసీసీ క్రికెట్ కమిటీ ఛైర్మన్ అయ్యాడు. ఈ ఏడాది ఆ పదవికి తిరిగి ఎన్నికయ్యాడు. 2021 సంవత్సరంలో అనిల్ కుంబ్లే స్థానంలో గంగూలీ ఈ పాత్రలో నియమితులయ్యారు. ఇటీవలే ఐసీసీ పురుషుల క్రికెట్ కమిటీ ఛైర్మన్‌గా తిరిగి నియమితులైన సౌరవ్ గంగూలీకి ఇప్పుడు రూ.125 కోట్లు అందనున్నాయి. అతను తన కొత్త ఒప్పందంతో ఈ డబ్బును పొందనున్నాడు. దీంతో 'దాదాగిరి'ని వదులుకోవలసి వస్తోంది. సౌరవ్ గంగూలీ హోస్ట్ చేసిన బెంగాలీ క్విజ్ షో పేరు 'దాదాగిరి'. ఓ నివేదిక ప్రకారం, గంగూలీ స్టార్ జల్సాతో రూ.125 కోట్ల ఒప్పందంపై సంతకం చేసినట్లు తెలుస్తోంది. బెంగాలీ టెలివిజన్‌లో 'దాదాగిరి' అనే క్విజ్ షోను నిర్వహించిన తర్వాత, సౌరవ్ గంగూలీ బెంగాల్‌లోని ప్రతి ఇంటికి చేరాడు. నివేదిక ప్రకారం, ఇప్పుడు స్టార్ జల్సా అతని ప్రజాదరణను క్యాష్ చేసుకోవాలనుకుంటోంది. ఎందుకంటే, గంగూలీతో 4 సంవత్సరాల ఒప్పందంపై రూ.125 కోట్లకు సంతకం చేసింది. ప్రతిగా, గంగూలీ బిగ్ బాస్ బంగ్లాకు హోస్ట్‌గా వ్యవహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అంతే కాకుండా, ఆ ఛానెల్ కొత్త క్విజ్ షోను కూడా తీసుకురాబోతోందంట. ఈ రెండు షోలు వచ్చే ఏడాది నుంచి ప్రసారం కానున్నాయి. వీటి నిర్మాణ పనులు జులై 2025 నుంచి ప్రారంభమవుతాయి. ఆ నివేదికలో, సౌరవ్ గంగూలీ తన కొత్త ఒప్పందంతో సంతోషంగా ఉన్నానని చెప్పినట్లు పేర్కొన్నారు. స్టార్ జల్సాతో అనుబంధం కలిగి ఉండటం ఆయనకు సంతోషంగా ఉంది. తాను, స్టార్ జల్సా ఇప్పుడు కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తామని, ఇది నాన్-ఫిక్షన్ కార్యక్రమాలపై దృష్టి సారిస్తుందని ఆయన అన్నారు.క్రికెట్‌కు అతీతంగా ప్రజలతో కనెక్ట్ అవ్వడం తనకు ఎప్పుడూ ఇష్టమని గంగూలీ అన్నారు. స్టార్ జల్సాతో ఈ అవకాశం మరింత లభిస్తుంది. ప్రజలను ప్రభావితం చేసిన నిజ జీవిత కథలను ఎదుర్కొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ 2021లో తొలిసారిగా ఐసీసీ క్రికెట్ కమిటీ ఛైర్మన్ అయ్యాడు. ఈ ఏడాది ఆ పదవికి తిరిగి ఎన్నికయ్యాడు. 2021 సంవత్సరంలో అనిల్ కుంబ్లే స్థానంలో గంగూలీ ఈ పాత్రలో నియమితులయ్యారు.

# చెన్నై టీమ్ లో గెలవాలనే కసి కనిపించడం లేదు



ఐపిఎల్ సీజన్ 2025లో వరుస ఓటములతో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె)పై ఆ జట్టు మాజీ ఆటగాడు సురేశ్ రైనా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాడు. చెన్నై ఇలాంటి చెత్త ప్రదర్శన చేస్తుందని తాను ఊహించలేక పోయానన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో బలంగానే ఉన్నా వరుస ఓటములు ఎదురు కావడం బాధించే అంశమన్నాడు. ఆటగాళ్లలో గెలవాలనే కసి కనిపించడం లేదన్నాడు. ఏ మ్యాచ్‌లోనూ చెన్నై తన స్థాయికి తగ్గ ఆటను కనబరచలేక పోయిందన్నాడు. కెప్టెన్ మారినా జట్టు ఆట తీరులో ఏమాత్రం మార్పులేదన్నాడు. ఇతర జట్ల ఆటగాళ్లు సర్వం ఒడ్డి పోరాడుతుంటే సన్‌రైజర్స్ టీమ్‌లో అది కొరవడిందన్నాడు. స్టార్ క్రికెటర్లు జట్టులో ఉన్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదన్నాడు. జట్టు యాజమాన్యం కూడా ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపక పోవడం బాధగా ఉందన్నాడు. ఇప్పటికైనా చెన్నై ఆటగాళ్ల ఆట తీరులో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైనా పేర్కొన్నాడు.



# హాట్ సమ్మర్‌లో ఎద అందాలతో చెమటలు పట్టిస్తున్న నేహా శెట్టి




# 'కల్కి 2' రిలీజ్ ఎప్పుడు? నాగ్ అశ్విన్ ఫన్నీ రిప్లై

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' గతేడాది విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకొని కలెక్షన్ల సునామీ సృష్టించింది. దీంతో దీని సీక్వెల్ కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న నాగ్ అశ్విన్ 'కల్కి 2' రిలీజ్‌పై ఫన్నీ రిప్లై ఇచ్చారు. 'కల్కి 2' ఎప్పుడు రిలీజ్ చేస్తారని అడగ్గా.. "కల్కి'ని 3, 4 గ్రహాలు ఒకే వరుసలో ఉన్నప్పుడు విడుదల చేశాను. దాని సీక్వెల్‌ను 7, 8 గ్రహాలు ఒకే వరుసలోకి వచ్చినప్పుడు రిలీజ్ చేస్తా. వేచి ఉండండి' అని ఫన్నీగా స్పందించారు. ప్రస్తుతం ఆయన రిప్లై వైరల్‌గా మారింది. ఇక ఇటీవల కూడా ఆయన 'కల్కి 2'పై స్పందించారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉన్నట్లు చెప్పారు. పార్ట్ 2లో ప్రభాస్ ఎక్కువసేపు స్క్రీన్‌పై కనిపిస్తారని.. ముఖ్యంగా భైరవ, కర్ణ యాంగిల్‌లోనే కథ సాగుందని తెలిపారు. రెండో భాగంలో వీరిద్దరి పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందన్నారు. వైజయంతి మూవీస్ పతాకంపై అశ్వనీదత్ 'కల్కి 2898 ఏడీ' చిత్రాన్ని నిర్మించారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఆడియన్స్‌ను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. ఇందులో అగ్ర నటులు అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, కమల్ హాసన్.. సుప్రీం యాస్కిన్‌గా ఆకట్టుకున్నారు. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలతో అలరించారు.

## కోర్ట్, కమిటీ కుర్రాళ్లు మాదిరే 'చౌర్య పాఠం' సక్సెస్ అవుతుంది: హీరో ఇంద్ర రామ్

కోర్ట్, కమిటీ కుర్రాళ్లు సినిమాలు కూడా కొత్త వారితో తీసినవే. అవి మంచి విజయాల్ని సాధించాయి. అలాగే మా 'చౌర్య పాఠం' సినిమా కూడా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది. సెన్సార్ సభ్యులు సినిమాని అప్రిషియేట్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అన్నారు యంగ్ హీరో ఇంద్ర రామ్. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'చౌర్య పాఠం'. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ త్రినాథరావు ఈ చిత్రంతో ప్రొడక్షన్స్‌లోకి అడుగుపెడుతున్నారు.కార్తికేయ -2 మొదలైన చిత్రాలకు చందూ మొండేటి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన నిఖిల్ గొల్లమారి ఈ మూవీతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. ఏప్రిల్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా హీరో ఇంద్ర రామ్ మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు.. మాది విజయవాడ. అక్కడే చదువుకున్నాను. ఢిల్లీ యూనివర్శిటీ ఇంజనీరింగ్ చేశాను. చదువుతో పాటు జిమ్నాస్టిక్స్ డ్యాన్స్ నేర్చుకున్నాను. సినిమాలు అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. ఆ ఇంట్రస్ట్ ఇటు వైపు తీసుకొస్తుందని భావిస్తున్నాను. నక్కిన గారు ఈ ప్రొడక్షన్ హౌస్ పెడుతున్నారని తెలిసి ఆయన్ని కలిశాను. అలా ఈ జర్నీ మొదలైయింది. ఈ సినిమాలో కథే మెయిన్ హీరో. ఈ సినిమాని హానెస్ట్ గా చేశాం. నక్కిన త్రినాథ్ గారు చాలా పాషన్ తో ఈ సినిమాని నిర్మించారు. ఈ సినిమా ప్రమోషన్స్ లో కూడా ఆయన యాక్టివ్ గా ఉంటున్నారు. ఇది రెగ్యులర్ ఫిల్మ్ కాదు. కథా రచయిత కార్తిక్ వాళ్ళ ఫాదర్ ఐజి గా పని చేశారు. ఇలాంటి కేసుని ఆయన టేకాఫ్ చేశారు. ఒక వీధిలో బ్యాంక్ ఉంటే మరో వీధిలో రూమ్ ని తీసుకొని అక్కడ నుంచి టన్నల్ తవ్వి బ్యాంక్ లోకి చొరబడ్డ సంఘటన జరిగింది. దానికి ఫిక్షన్ జోడించి ఈ సినిమాని చేయడం జరిగింది. ఈ సినిమా కోసం చాలా హొం వర్క్ చేశాం. ఇలాంటి సినిమా చేయడానికి ఎలాంటి రిఫరెన్స్ ఉండదు. ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర ఈ సినిమాలో టన్నల్స్ క్రియేట్ చేయడానికి చాలా కేర్ తీసుకున్నారు. ఇదొక డిఫరెంట్ వరల్డ్. చాలా కష్టపడ్డాం. అది స్క్రీన్ పై కనిపిస్తుంది. ఇందులో ఒక ఫిక్షనల్ విలేజ్ ని క్రియేట్ చేయడం జరిగింది. ఈ సినిమాకి విజయ సేతుపతి గారు, నాగచైతన్య గారు, వరుణ్ తేజ్ అన్న అందరూ సపోర్ట్ చేశారు. అలాగే సజ్జనార్ గారి ఇంటర్వ్యూ కూడా చాలా హెల్ప్ అయ్యింది. నాకు రామ్ గోపాల్ వర్మ గారు ఇష్టం. సినిమా అవకాశం కోసం ఆయన దగ్గరికి వెళ్లాను. వంగవీటి సినిమా సమయంలో ఓ క్యారెక్టర్ ఇచ్చారు. అలాగే దర్శకుడు అజయ్ భూపతితో నాకు జర్నీ వుంది. ఆర్ఎక్స్ 100 నేను చేయల్సిన సినిమా. కానీ కొన్ని కారణాల వలన కుదరలేదు. కార్తికేయ అద్భుతంగా చేశాడు.





## పహల్గాంలోనే నా పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకున్నా

జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడిలో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. పహల్గాంలో మంగళవారం ప్రకృతి అందాలను చూస్తోన్న పర్యటకులపై ఉగ్రవాదులు ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిని సినీ సెలబ్రిటీలు ఖండిస్తున్నారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన ఆ ప్రాంతంతో తన అనుబంధాన్ని హీరో విజయ్ దేవరకొండ తాజాగా గుర్తుచేసుకున్నారు. ఈ దాడి ఘటన తన మనసును కలిచివేస్తోందంటూ పోస్ట్ పెట్టారు. "రెండేళ్ల క్రితమే నా పుట్టినరోజును పహల్గాంలో సెలబ్రేట్ చేసుకున్నాను. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన నేను.. కశ్మీర్‌లోని అందమైన ప్రాంతంలో అక్కడి ప్రజల స్వచ్ఛమైన నవ్వుల మధ్య నా పుట్టినరోజు చేసుకున్నాను. స్థానికంగా ఉండే కశ్మీరీ స్నేహితులు నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. నిన్న ఆ ప్రాంతంలో జరిగినది విని నా హృదయం పగిలిపోయింది. ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం సిగ్గుచేటు. ఇలాంటి పిరికి వాళ్లను త్వరలోనే అంతమొందిస్తారని ఆశిస్తున్నా. భారతదేశం ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదు. బాధిత కుటుంబాలకు మేం అండగా నిలుస్తాం" అని విజయ్ దేవరకొండ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. పహల్గాంలో మంగళవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ సినీ ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. ఇది క్షమించరాని క్రూరమైన చర్య అని చిరంజీవి అన్నారు. బాధితులను చూస్తుంటే తన హృదయం బరువెక్కుతోందని ఎన్టీఆర్ తెలిపారు. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేకపోతున్నానంటూ జాన్వీకపూర్ ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి తెలియజేస్తూ అల్లు అర్జున్ పోస్ట్ పెట్టారు.

# ఓటీటీలోకి వచ్చిన మరో సూపర్‌హిట్ హారర్ థ్రిల్లర్ 'మసూద'



టాలీవుడ్ యువ నటులు సంగీత, తిరువీర్, కావ్య కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ హిట్ చిత్రం మసూద. హారర్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రాన్ని స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్కా నిర్మించగా.. సాయి కిరణ్ దర్శకత్వం వహించాడు. నవంబర్ 18 2022న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్‌హిట్‌ను అందుకుంది. అయితే ఈ సినిమా ప్రస్తుతం తెలుగు ఓటీటీ వేదిక ఆహాలో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే తెలుగులో మాత్రమే ఈ సినిమా అందుబాటులో ఉండడంతో వేరే భాష ప్రేక్షకులకు రీచ్ కాలేకపోయింది. అయితే ఈ మూవీ వచ్చిన దాదాపు 3 ఏండ్ల తర్వాత మరో ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది ఈ చిత్రం. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియలో ఈ చిత్రం ప్రస్తుతం తెలుగుతో పాటు ఇతర భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. నీలం (సంగీత) ఒక ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తూ, భర్త అబ్దుల్ (సత్య ప్రకాశ్) నుంచి విడిపోయి, తన కూతురు నాజియా (బాంధవి శ్రీధర్)తో కలిసి ఒక అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటుంది. అదే అపార్ట్‌మెంట్‌లో నివసించే గోపీ (తిరువీర్) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అతను తన సహోద్యోగి మినీ (కావ్యా కళ్యాణ్ రామ్)ను ప్రేమిస్తాడు, కానీ ఆ విషయాన్ని ఆమెతో చెప్పడానికి భయపడతాడు. ఒకే అపార్ట్‌మెంట్‌లో ఉండడం వల్ల గోపీ, నీలం కుటుంబంతో సన్నిహితంగా మెలుగుతాడు. అప్పుడప్పుడు నీలం, నాజియాతో కలిసి గోపీ బయటకు వెళ్తుంటాడు. ఒక రోజు నాజియా విచిత్రంగా ప్రవర్తించడం మొదలుపెడుతుంది. అర్ధరాత్రి వేళ ఏవో వింత మాటలు మాట్లాడుతుంది. కూతురి పరిస్థితిని చూసి భయపడిన నీలం, గోపీ సహాయం కోరుతుంది. నాజియా ప్రవర్తనను గమనించిన గోపీ, ఆమెకు దెయ్యం పట్టి ఉంటుందని అనుమానిస్తాడు. ఆమెను రక్షించడానికి వారు అనేక ప్రయత్నాలు చేస్తారు. చివరకు అల్లా ఉద్దీన్ (సత్యం రాజేశ్) సలహాతో పీర్ బాబా (శుభలేఖ సుధాకర్)ను సంప్రదిస్తారు. ఈ తర్వాత గోపీ, నీలంలకు ఎదురైన సవాళ్లు ఏమిటి? నాజియా శరీరంలోకి దెయ్యం ఎలా ప్రవేశించింది? మసూద ఎవరు, ఆమె నేపథ్యం ఏమిటి? మసూదను మీర్ చాచా ఎందుకు చంపాడు? నాజియాను కాపాడేందుకు గోపీ చేసిన సాహసం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే, థియేటర్‌లో 'మసూద' సినిమా చూడాల్సిందే.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,